RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా నిజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా నిజన్
18వ వసంతంలోకి

తెలంగాణ తల్లి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:65 SUNDAY, AUGUST 2,2026 PAGES:12 COST:2 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :65 ఆదివారం, ఆగష్టు 2, 2026, పేజీలు -12 వెల :2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## రేషన్ కార్డు ఉన్నవారికి అదిరిపోయే గుడ్ న్యూస్

### నేటి నుంచే రెడీగా ఉండండి.. ఒకేసారి.!



తెలంగాణ పత్రిక ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రేషన్ కార్డుదారులకు శుభవార్త అందించింది. మూడు నెలల రేషన్‌ను ఒకేసారి అందించాలని నిర్ణయం తీసుకుంది. వర్షాభావ పరిస్థితుల క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో రేషన్ కార్డు ఉన్నవారు ఊరట చెందుతున్నారు. ఈ వివరాలు చూస్తేరేషన్ కార్డు ఉన్నవారికి భారీ గుడ్ న్యూస్ అందింది. 2

## రాన్‌పై మహా దాడికి అమెరికా-ఇజ్రాయెల్ సిద్ధం?

### ట్రంప్ గ్రీన్ సిగ్నల్‌పైనే ప్రపంచం చూపు.!



తెలంగాణ పత్రిక ప్రతినిధి: మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా భారీ వైమానిక దాడులకు సిద్ధమవుతున్నట్లు ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థలు అమెరికా అధికారులను ఉటంకిస్తూ వెల్లడించాయి. ఈ వారాంతం లోనే దాడులు జరిగే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి..మధ్యప్రాచ్యంలో మరోసారి మిగతా12లో

# హైడ్రాపై తగ్గేదేలే..!

### హైదరాబాద్‌కి సరికొత్త అందాలు జోడిస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి సంచలన పోస్ట్



తెలంగాణ పత్రిక ప్రతినిధి: హైడ్రాపై విమర్శలు, హైకోర్టు తీర్పుతో రాజకీయ దుమారం కొనసాగుతున్న వేళ సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి హైడ్రాకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఉప్పల్ నల్లచెరువు పునరుజ్జీవ పనులను ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో ప్రత్యేక పోస్టు చేసిన ఆయన.. చెరువుల పరిరక్షణ అంటే భావితరాల భవిష్యత్తును కాపాడటమేనని పేర్కొన్నారు. హైడ్రా పనితీరును కొనియాడుతూ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయిఒకవైపు విపక్షాల విమర్శల వర్షం.. మరోవైపు హైకోర్టు తీర్పుతో కలకలం.. అయినా, తగ్గేదే లేదంటూ కాంగ్రెస్ కౌంటర్స్.. కొన్నాళ్లుగా హైడ్రా అండ్ కమిషనర్ రంగనాథ్ చుట్టూ నడుస్తోన్న హైవోల్టేజ్ వార్ ఇది.. అయితే.. హైడ్రా టార్గెట్‌గా విపక్షాలు ఎన్ని విమర్శలుచేసినా.. రంగనాథ్‌ను తొలగించాలని హైకోర్టు ఆదేశించినా.. తగ్గేదే లేదన్న కామెంట్స్.. కాంగ్రెస్ నుంచి, సీఎం రేవంత్ రెడ్డి నుంచి వినిపించాయ్. ఆరునూరైనా.. నూరుఆరైనా.. హైడ్రా ఆగనే ఆగదని తేల్చిచెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఒక రేంజ్ ఎలివేషన్ ఇచ్చారు. ఉప్పల్ నల్లచెరువు సాక్షిగా హైడ్రాపై ప్రశంసల వర్షం కురిపించారు సీఎం. చెరువులు పునరుద్ధరించడంలో హైడ్రా కృషిని మిగతా2లో

# కాళేశ్వరం భద్రతే ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యం




తెలంగాణ పత్రిక: బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మాణ లోపాల వల్లే సమస్యలు తలెత్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. పెద్దపల్లిలో జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టు, ఎల్లంపల్లి ప్రాజెక్టుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్ఆర్ఎస్పి, మిగతా2లో



## ధరణి అక్రమాలపై ఉక్కుపాదం.. ఫాస్ట్‌ట్రాక్ విచారణ

హైదరాబాద్, ఆగస్టు 01: గత ప్రభుత్వ హయాంలో 'ధరణి' పోర్టల్ వేదికగా జరిగిన భూ అక్రమాలపై ప్రభుత్వం తీవ్రస్థాయిలో దృష్టి సారించిందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. త్వరలోనే ఫాస్ట్‌ట్రాక్ విచారణ ద్వారా బాధ్యులపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. మిగతా2లో

## మీసేవలో చరిత్రాత్మక రికార్డు

తెలంగాణ పత్రిక : తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ పాలనకు ప్రతీకగా నిలిచిన మీసేవ సేవలు మరో అరుదైన ఘనతను సాధించాయి. గతంలో రోజుకు సగటున 70 నుంచి 80 వేల వరకు మాత్రమే నమోదయ్యే లావాదేవీలు 12లో







2

## హైడ్రా పనులతో మారిన రూపు

- నిండుకుండలా ఉప్పల్ నల్లచెరువు భారీ వర్షాలతో పూర్తిగా
- నిండిపోయిన చెరువు రూ. 20 కోట్లతో హైడ్రా చేపట్టిన అభివృద్ధి పనుల సత్ఫలితం
- మురుగునీరు కలవకుండా ప్రత్యేక కాలువ నిర్మాణం
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అధికారుల ప్రణాళిక





## తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్: దరఖాస్తుల తేదీలు ఖరారు

- తెలంగాణలో 7,437 పోలీస్ పోస్టుల భర్తీకి ప్రకటన
- ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు
- పోలీస్, ఎస్పీఎఫ్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో ఖాళీల భర్తీ
- నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసిన టీఎస్ఎల్‌పీఆర్‌బీ

తెలంగాణ పత్రిక:తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో 7,437 పోస్టుల భర్తీకి సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ తేదీలను ప్రభుత్వం మిగతా2లో

## వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్ జీ ఓటర్లు

- వాట్సాప్ అంకుల్స్ పై ఇన్‌స్టా పిల్లలు గెలిచారు: కేటీఆర్
- సోషల్ మీడియా వల్లే జవాబుదారీతనం పెరిగిందన్న కేటీఆర్
- నేటి యువతరం రీల్స్ రూపంలో వార్తలు చూస్తోందని వ్యాఖ్య



2

వచ్చే ఎన్నికల్లో 50 శాతానికి పైగా జెన్-జీ తరం ఓటర్లే కీలక పాత్ర పోషించబోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

# వరద ముప్పుపై అప్రమత్తంగా ఉండాలి



- ముంపు ప్రాంతాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి
- మంత్రి సీతక్క

వరద ముప్పుపై ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముంపు ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, గోదావరి తీర ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ పత్రిక

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నిజన్



# హైడ్రాపై తగ్గేదేలే..!

సీఎం. చెరువులు పునరుద్ధరించడంలో హైడ్రా కృషిని అభినందించారు. ఉప్పల్ నల్లచెరువు పునరుజ్జీవానికి హైడ్రా అధికారులు, సిబ్బంది అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. హైదరాబాద్ జఖ=జు పరిధిని క్యూర్ చేసుకుంటూ, మన చెరువులకు జీవం పోస్తూ, భావి తరాలకు జీవంతో నిండిన భవిష్యత్తును హైడ్రా అందిస్తోందన్నారు రేవంత్‌రెడ్డి. హైదరాబాద్‌లో చెరువుల పునరుజ్జీవంపై సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన రేవంత్‌రెడ్డి.. ఉప్పల్ నల్లచెరువును ప్రత్యేకంగా ప్రస్తావించారు. నాడు-నేడు పేరుతో ఒక వీడియోను పోస్ట్‌చేశారు. ఉప్పల్ నల్లచెరువు.. గతంలో ఎలా ఉండేదో.. హైడ్రా ఆపరేషన్ తర్వాత ఇప్పుడెలా ఉందో తెలియజేస్తూ వీడియో పెట్టారు. రేవంత్ పెట్టిన ఈ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతంలో మురుగునీటితో కళావిహీనంగా కనిపించిన నల్లచెరువును 20 కోట్ల రూపాయల వ్యయంతో సుందరంగా తీర్చిదిద్దింది హైడ్రా. చెరువు శిఖంలో ఆక్రమణలను తొలగించి.. పర్యాటక కేంద్రంగా అభివృద్ధిచేసింది. వరదనీరు సులభంగా చెరువులోకి చేరేలా రెండు ఇన్‌లెట్లు.. మురుగునీరు కలవకుండా ప్రత్యేక డైవర్షన్ కాలువ నిర్మాణాలు చేపట్టారు. చెరువు పూర్తిగా నిండి నీటిమట్టం ప్రమాదకరస్థాయికి చేరితే.. ఔట్‌ఫ్లో కోసం ఔట్‌లెట్లు నిర్మించారు. చెరువు ఔట్‌ఫ్లో ఈజీగా మూసీలో కలిసేలా ఏర్పాట్లుచేయడంతో ఉప్పల్ ప్రాంతంలో వరద ముప్పు కూడా గణనీయంగా తగ్గించారు. హైడ్రా ఆపరేషన్ తర్వాత కొత్తరూపు సంతరించుకున్న ఉప్పల్ నల్లచెరువు.. ఇటీవల కురిసిన వర్షాలతో నిండుకుండను తలపిస్తోంది. దాంతో, చెరువుల పునరుజ్జీవం, హైడ్రాను అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు సీఎం రేవంత్. చెరువులను పరిరక్షించడం అంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదు.. భావి తరాల భవిష్యత్తును భద్రపరచడమన్నారు సీఎం రేవంత్. చెరువుల పునరుజ్జీవంతో రూపురేఖలు మార్చుకుంటున్న హైదరాబాద్‌ను చూస్తుంటే తనకెంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఇక ముందు కూడా ప్రతి చెరువును కాపాడుతూ... ప్రతి అంగుళం ప్రజా ఆస్తిని సంరక్షిస్తూ ముందుకు సాగుతామన్నారు సీఎం రేవంత్. అయితే, హైకోర్టు తీర్పుతో విమర్శల దాడి పెరిగినవేళ.. హైడ్రాను ఆకాశానికెత్తుతూ రేవంత్‌రెడ్డి పోస్ట్ పెట్టడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది

# భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే..

పవిత్రమైన ఉత్తరాంధ్ర గడ్డపై అడుగుపెట్టడం తనకు ఎంతో గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో, తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. నేటి రోజు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో, ముఖ్యంగా స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక కీలకమైన రోజని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యమైన 'థింసా' ప్రదర్శన తనను మధురానుభూతికి లోనుచేసిందని ప్రధాని తెలిపారు. ఒకేసారి 13 వేల మంది గిరిజన మహిళలు ఈ నృత్యం చేయడం ఒక అద్భుతమని, ఇది ప్రపంచ రికార్డు సృష్టించిందని కొనియాడారు. ఈ నృత్యంలో మన తరతరాల వారసత్వం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రధాని మోదీ హృదయపూర్వకంగా అభినందించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక కొత్త 'రన్‌వే'గా పనిచేస్తుందని మోదీ ఉద్ఘాటించారు. ఇది ఆంధ్ర యువత ఉజ్వల భవిష్యత్తుకు ఒక 'లాంచ్‌ప్యాడ్' అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో దేశంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒకే కుటుంబం పేర్లు కనిపించేవని, కానీ తమ ప్రభుత్వం మహనీయుల పేర్లను పెడుతోందని స్పష్టం చేశారు. "అయోధ్యలో విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి పేరు పెట్టాం. పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరుతో ఎయిర్‌పోర్ట్ ప్రారంభించాం. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం" అని ప్రధాని వివరించారు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# అసెంబ్లీలో విద్వేష ప్రసంగాలకు చెక్

అసెంబ్లీలో విద్వేషపూరిత, రెచ్చగొట్టే వ్యాఖ్యలను నిరోధించేందుకు తెలంగాణ ప్రభుత్వం సన్నాహకాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో సెలెక్ట్ కమిటీ చైర్మన్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈరోజు కీలక సమావేశం జరిగింది. ఈ భేటీకి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవ లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాణిక్ రావు హాజరయ్యారు. సమావేశంలో విద్వేష ప్రసంగాలు, క్రైమ్ బిల్లు ప్రతిపాదనలపై సమగ్రంగా చర్చించారు. సమావేశం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ... అసెంబ్లీ పరిధిలో సభ్యులు భావప్రకటనా స్వేచ్ఛను వినియోగిం చుకుంటూనే, ఇతరులను వ్యక్తిగతంగా దూషించడం లేదా విద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా ఉండేలా బలమైన చట్టం తీసుకురావడమే తమ కమిటీ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. శాసనసభ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు ఈ క్రైమ్ అండ్ హేట్ స్పీచ్ బిల్లుపై పూర్తి నివేదికను అసెంబ్లీకి సమర్పించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. వారం రోజుల్లో కమిటీ మరోసారి సమావేశం కానుంది. వివిధ రాజకీయ పార్టీలతో పాటు సమాజంలోని ప్రముఖులు, నిపుణుల సలహాలను పరిగణనలోకి తీసుకుని నివేదికను తుదిరూపు ఇస్తామన్నారు. ఈ చట్టం ఎవరి హక్కులనూ కాలరాయదని, కేవలం సభ గౌరవాన్ని, వ్యక్తుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకేనని భరోసా ఇచ్చారు.

## వరద ముప్పుపై అప్రమత్తంగా ఉండాలి

వరద ముప్పుపై ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముంపు ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, గోదావరి తీర ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేస్తున్నామని, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. శనివారం మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీవో లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి మంగపేటలో గోదావరి వరద ప్రవాహాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం వరద ముంపు ప్రాంతాల బాధితులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సీతక్క మంగపేట గోదావరి కరకట్ట నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, బ్యాక్‌వాటర్ ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెందిన 28 కుటుంబాల 112 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నందని, నది పరివాహక ప్రాంతాల్లోకి వరద నీరు చేరే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. అదేవిధంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అంతేకాకుండా పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వరద బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్య సౌకర్యాలు సహా అన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐతే బాధితులను పరామర్శించిన మంత్రి వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, డి పి ఓ వెంకయ్య, తహసిల్దార్ తోట రవీందర్, ఎం పి డి ఓ బద్రు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డు ఉన్నవారికి అదిరిపోయే గుడ్ న్యూస్..

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రేషన్ కార్డుదారులకు శుభవార్త అందించింది. మూడు నెలల రేషన్‌ను ఒకేసారి అందించాలని నిర్ణయం తీసుకుంది. వర్షాభావ పరిస్థితుల క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో రేషన్ కార్డు ఉన్నవారు ఊరట చెందుతున్నారు. ఈ వివరాలు చూస్తేరేషన్ కార్డు ఉన్నవారికి భారీ గుడ్ న్యూస్ అందింది. మూడు నెలల సరుకులు ఒకేసారి పంపిణీ చేయనున్నారు అధికారులు. వర్షాభావ పరిస్థితుల క్రమంలో ఆగస్ట్, సెప్టెంబర్, అక్టోబర్ నెలకు సంబంధించిన రేషన్‌ను ఈ నెలలోనే అందించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఆదేశాలతో తెలంగాణ ప్రభుత్వం మూడు నెలల రేషన్‌ను ఒకేసారి అందిస్తోంది. నేటి నుంచి ఈ పంపిణీ కార్యక్రమం మొదలవ్వగా.. ఈ నెల 15వ తేదీ వరకు అందించనుంది. దీంతో లబ్దిదారులు ఈపాస్ మెషిన్‌లో తన బయోమెట్రిక్‌ను నమోదు చేసి తమ కోటాకు సంబంధించిన రేషన్ తీసుకోవచ్చు. అయితే మూడుసార్లు బయోమెట్రిక్స్ నమోదు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఎల్‌నివో ప్రభావం కనిపిస్తుండటం, వర్షాభావ పరిస్థితులు క్రమంలో ప్రజలకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు మూడు నెలల కోటా ఒకేసారి ఇస్తున్నారు. ఇప్పటికే రేషన్ సరఫరా ఇప్పటికే రేషన్ దుకాణాలకు బియ్యం చేరుకున్నాయి. మండల్ లెవల్ స్టాక్ పాయింట్ల నుంచి దుకాణాలకు సరఫరా అవుతున్నాయి. చిన్న రేషన్ దుకాణాలకు ఒకేసారి మొత్తం రవాణా చేయనుండగా.. పెద్ద షాపులకు రెండుసార్లు సరఫరా చేయనున్నారు. గతంలో ఎండల దృష్ట్యా ఏప్రిల్, మే, జూన్ నెలకు సంబంధించిన రేషన్ ఒకేసారి పంపిణీ చేపట్టారు. జులై నెలకు సంబంధించిన కోటాను ఎప్పటిలాగే అందించారు. ఇప్పుడు ఆగస్ట్, సెప్టెంబర్, అక్టోబర్ రేషన్ ఒకేసారి అందిస్తున్నారు. లబ్దిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పౌరసరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు మూడు నెలల రేషన్ పంపిణీని ఏర్పాట్లు పూర్తి చేశారు. మూడు నెలల రేషన్ ఒకేసారి అందించాలంటే రేషన్ షాపుల్లో బియ్యం స్టోరేజ్ కోసం ఎక్కువ స్థలం అవసరం. కానీ రేషన్ దుకాణాలు చిన్నగా ఉండటం వల్ల స్టాక్ భద్రపరిచేందుకు స్థలం సరిపోవడం లేదు. దీంతో రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**మొరాయిస్తున్న ఈ-పాస్ యంత్రాలు**

ఒకేసారి మొత్తం స్టాక్‌ను భద్రపర్చడం తమకు భారమవుతుందని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు వేలిముద్రల నమోదులో కూడా జాప్యం జరుగుతోంది. ఒకేసారి మూడుసార్లు వేలిముద్రలు పెట్టాల్సి ఉంటుంది. దీంతో కొన్నిసార్లు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ పాస్ యంత్రాలు కొన్నిసార్లు పనిచేయకుండా మొరాయిస్తున్నాయి. దీంతో రేషన్ పంపిణీ ఆలస్యమవుతుందని రేషణ్ డీలర్లు ఆవేదన చెందుతున్నారు. ఒక్కో కార్డుదారుడికి మూడు నెలల రేషన్ అందించాలంటే 15 నుంచి 20 నిమిషాల సమయ పడుతుంది వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ పాస్ మెషీన్లలో సాంకేతిక సమస్యలు రాకుండా జాగ్రత్తగా తీసుకోవాలని కోరుతున్నారు.

## హైడ్రా పనులతో మారిన రూపు..

హైదరాబాద్‌లోని ఉప్పల్ నల్లచెరువు నిండుకుండను తలపిస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ చెరువు జలకళను సంతరించుకుంది. గతంలో ఆక్రమణలు, మురుగునీటి ప్రవాహంతో కళావిహీనంగా మారిన ఈ చెరువు, హైడ్రా చేపట్టిన పునరుద్ధరణ చర్యలతో పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. సుమారు రూ. 20 కోట్ల అంచనా వ్యయంతో హైడ్రా అధికారులు చెరువు అభివృద్ధి పనులను చేపట్టారు. ఇందులో భాగంగా చెరువు శిఖం భూమిలోని ఆక్రమణలను తొలగించారు. పరిసర ప్రాంతాల్లో నుంచి వరద నీరు సులభంగా చెరువులోకి చేరేలా రెండు కొత్త ఇన్‌లెట్లను నిర్మించారు. అదే సమయంలో, మురుగునీరు చెరువులో కలవకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రత్యేక డైవర్షన్ కాలువను ఏర్పాటు చేశారు. చెరువు గరిష్ట స్థాయికి చేరినప్పుడు అదనపు నీరు సాఫీగా బయటకు వెళ్లేలా ఔట్‌లెట్లను ఆధునికీకరించారు. ఈ నీరు నేరుగా మూసీ నదిలో కలిసేలా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. దీనివల్ల ఉప్పల్ ప్రాంతంలో వరద ముప్పు గణనీయంగా తగ్గనుంది. ఈ చెరువును కేవలం నీటి వనరుగానే కాకుండా, భవిష్యత్తులో ఆహ్లాదకరమైన పర్యాటక, విహార కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

# తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్: దరఖాస్తుల తేదీలు ఖరారు

తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో 7,437 పోస్టుల భర్తీకి సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ తేదీలను ప్రభుత్వం ఖరారు చేసింది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) బుధవారం నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లను విడుదల చేసింది. పోలీస్ శాఖతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్), అగ్నిమాపక, జైళ్ల శాఖల్లోని ఖాళీలను ఈ నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. మొత్తం ఖాళీలలో అత్యధికంగా కానిస్టేబుల్, ఆ పైస్థాయి ఉద్యోగాలే ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పోస్టుల వివరాలను పరిశీలిస్తే సివిల్ ఎస్సై-148, ఏఆర్ ఎస్సై-14, టీజీఎస్పీ ఏఆర్ ఎస్సై-12, ఎస్ఏఆర్ సీపీఎల్ ఎస్సై-03, ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్సై-23, సివిల్ కానిస్టేబుల్-3,697, ఏఆర్ కానిస్టేబుల్-1,052, ఎస్ఏఆర్ సీపీఎల్ కానిస్టేబుల్-24, కానిస్టేబుల్ (డ్రైవర్) పీటీవో-20, కానిస్టేబుల్ (మెకానిక్) పీటీవో-07 చొప్పున ఖాళీలు ఉన్నాయి.

## వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్ జీ ఓటర్లు

వచ్చే ఎన్నికల్లో 50 శాతానికి పైగా జెన్-జీ తరం ఓటర్లే కీలక పాత్ర పోషించబోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల నీట్ పరీక్ష వైఫల్యంపై జరిగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' విజయం సాధించారని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మారుతున్న రాజకీయ సమీకరణాలు, యువతరం ప్రాధాన్యతపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "యువతరం సరికొత్త రీతిలో ఢిల్లీలో కదం తొక్కింది. ఎవరితోనైతే ఘర్షణకు వెళ్లకూడదో, ప్రధాని మోదీ సరిగ్గా వారితోనే తలపడ్డారు. ఇటీవల జరిగిన పరిణామాల్లో 'వాట్సాప్ అంకుల్స్'తో సాగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' ఎలా పైచేయి సాధించారో దేశం మొత్తం చూసింది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ సైతం అర్ధరాత్రి సమయంలో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా లేకపోతే పాలకుల్లో జవాబుదారీతనం ఉండేది కాదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. నేటి యువత వార్తాపత్రికలు చదవడం గానీ, టీవీ ఛానెళ్లు చూడటం గానీ తగ్గించారని, 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న వారు వార్తలను సైతం రీల్స్ రూపంలోనే వీక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## కాళేశ్వరం భద్రతే ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యం

పెద్దపల్లిలో జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టు, ఎల్లంపల్లి ప్రాజెక్టుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్‌ఆర్‌ఎస్పి, కడెం, ఎల్లంపల్లి వంటి ప్రధాన ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిగా దృఢంగా ఉందని, అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో నిర్మాణ లోపాల కారణంగ సమస్యలు తలెత్తాయని విమర్శించారు. ఎల్లంపల్లి పంపులను ఆన్ చేసి మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోశామని బీఆర్ఎస్ ప్రచారం చేసుకుందని, కానీ వాస్తవ పరిస్థితులు అందరికీ తెలుసని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ నివేదికల ఆధారంగానే ప్రస్తుతం బ్యారేజీల్లో నీటి నిల్వలను పరిమితం చేస్తున్నాం. కన్నెపల్లి పంపులను వెంటనే ఆన్ చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉంది. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టుల ఫౌండేషన్ సక్రమంగా లేదు. ఐఐటీ బాంబే, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు వచ్చే వర్షాకాలం వరకు నీటి నిల్వలను నియంత్రిస్తాం. భద్రతా సూచనలను విస్మరించి నీటిని నిల్వ చేస్తే డ్యాం దిగువన ఉన్న గ్రామాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితుల్లో బాధ్యత ఎవరు వహిస్తారు' అని అన్నారు.

## ధరణి అక్రమాలపై ఉక్కుపాదం.. ఫాస్ట్‌ట్రాక్ విచారణ

హైదరాబాద్, ఆగస్టు 01: గత ప్రభుత్వ హయాంలో 'ధరణి' పోర్టల్ వేదికగా జరిగిన భూ అక్రమాలపై ప్రభుత్వం తీవ్రస్థాయిలో దృష్టి సారించిందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. త్వరలోనే ఫాస్ట్‌ట్రాక్ విచారణ ద్వారా బాధ్యులపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. విలేకరులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. ధరణి నుంచి నేటి 'భూభారతి' వరకు జరిగిన ప్రతి లావాదేవీపై సమగ్ర విచారణ జరుపుతామని, పేదల భూములను కాజేసిన ఎంతటివారినైనా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

**'భూధార్'తో సరికొత్త విప్లవం:**

ప్రభుత్వం కొత్తగా ఒక్క అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితా (ౄతీశీష్ట్రఱఎఱవం ూఱర) లో చేర్చలేదని, గతంలో పెట్టిన జాబితాపై సమగ్ర పరిశీలన జరుగుతోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 276 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని వెల్లడించారు. ఇకపై ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేకమైన 'భూధార్' సంఖ్యను కేటాయించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి త్వరలోనే ఒక స్పష్టమైన, సమగ్రమైన విధానాన్ని ప్రవేశపెడతామని, ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ పడేది లేదని తేల్చిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినప్పటికీ 'ఇందిరమ్మ ఇళ్లు' బిల్లుల చెల్లింపులు ఆపేది లేదని, లబ్ధిదారులకు క్రమం తప్పకుండా నిధులు విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. భూముల ధరల సవరణ వల్ల రిజిస్ట్రేషన్ల ఆదాయం 10 నుంచి 20 శాతం వరకు పెరిగిందని, ప్రస్తుతం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ద్వారా వచ్చే ఆదాయం దాదాపు రూ.18,000 కోట్లకు చేరే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు.

# అంబేద్కర్ నగర్‌లో రూ.8 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్ ఆగస్టు1:**
కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చొరవతో జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో రూ.8 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బీఆర్ఎస్ నాయకులు, స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన నిర్వహించారు. జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని 284వ వార్డు గణేష్‌నగర్ డివిజన్‌లోని అంబేద్కర్ నగర్‌లో రూ.8 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం బీఆర్ఎస్ నాయకులు, స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ అభివృద్ధి పనులు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ ప్రత్యేక చొరవ, నిరంతర కృషి



ఫలితమేనని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే అధికారులతో సమన్వయం చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారని తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో బురద, నీటి నిల్వ సమస్యలు తొలగిపోవడంతో పాటు స్థానికులకు సౌకర్యవంతమైన రాకపోకలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఈ పనులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దిలీప్ గౌడ్, కార్యదర్శి రాజేష్, బాలరాజు, నసీర్, జగదీష్, బీఆర్ఎస్ నాయకులు దేవరకొండ శ్రీనివాస్, సత్తిరెడ్డి, సోమేశ్ యాదవ్, కిషోర్ చారి, జాలిగాం రాకేశ్, వెంకటేష్, కళ్లెం శ్రీనివాస్, మహేష్, ఖలీల్, ఆంజనేయులు, అజయ్, రమణారెడ్డి, జయం చారి, మధుకర్ రెడ్డి, రమేష్, కనకయ్య, రంగనాయకులు, వెంకట్ రెడ్డి, నరసింహతో పాటు కాలనీ ప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్ని శాఖల సమన్వయంతో ‘ఆపరేషన్ ముస్కాన్’ విజయవంతం

**-జిల్లాలో 104 మంది బాలబాలికలకు సంరక్షణ**
**-బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై 27 కేసులు నమోద్ను**
**-జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, ఐపీఎస్న్**

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1,తెలంగాణ పత్రిక**
రాజన్న సిరిసిల్ల జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్--2026 విజయవంతంగా పూర్తైందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, ఐపీఎస్ తెలిపారు. జూలై 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో జిల్లావ్యాప్తంగా 104 మంది బాలబాలికలను గుర్తించి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) ముందు హాజరుపరిచి, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం అప్పగించామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు తప్పిపోయిన, నిరాశ్రయ స్థితిలో ఉన్న పిల్లలను గుర్తించి వారి కుటుంబాలకు



చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ఆపరేషన్ స్మైల్ మరియు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, కార్మిక శాఖ, విద్యాశాఖ, జిల్లా బాలల సంరక్షణ శాఖ, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి హోటళ్లు, పరిశ్రమలు, వర్క్‌షాపులు, దుకాణాలు, ఇతర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో 18 సంవత్సరాల లోపు బాలలను పనిలో పెట్టుకుని పని చేయిస్తున్న వారిపై 27 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కోరారు. వీధుల్లో సంచరిస్తున్న బాలలు, బాలికలు లేదా బాల కార్మికులను గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. భవిష్యత్తులో కూడా బాల కార్మికులను పనిలో పెట్టుకునే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతానికి సహకరించిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రత్యేకంగా అభినందించారు.

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

**-ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలి**
**-తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు**

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1,తెలంగాణ పత్రిక**
క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ పిలుపునిచ్చింది. ఈ మేరకు వేములవాడ మండలం నూకలమర్రి గ్రామంలో కరపత్రాన్ని విడుదల చేసి, అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 200 రోజుల పని కల్పించాలని, రోజువారీ కూలీని రూ.600కు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా కొనసాగించాలని, “వికసిత్ భారత్ గ్రామ్ జీ” పేరుతో తీసుకొస్తున్న మార్పులను రద్దు చేయాలని కోరారు. 2005లో యూపీఏ ప్రభుత్వ హయాంలో వామపక్షాల పోరాటాల ఫలితంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆ పథకంలో మార్పులు చేస్తూ మహాత్మా గాంధీ పేరును తొలగించడంతో పాటు, రాష్ట్రాల ఆర్థిక భారం పెంచే విధంగా నిధుల వాటాను 10 శాతం నుంచి 40 శాతానికి పెంచే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అలాగే 100 రోజుల ఉపాధి హామీని బలహీనపరిచే చర్యలను కూడా ఖండించారు. ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించేందుకు, వ్యవసాయ కార్మికుల హక్కులను కాపాడేందుకు ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమంలో వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కూలీలు, శ్రామిక వర్గాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గురిజాల శ్రీధర్తో పాటు నూకలమర్రి గ్రామం, లంబాడి కాలనీకి చెందిన గ్రామస్థులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# నవజాత శిశువుకు తల్లిపాలే రక్షణ కవచం



**-జిల్లా సంక్షేమ అధికారిని జె. స్వర్ణలత లేనినా.**

**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక ఆగష్టు 1**
బిడ్డ పుట్టిన మొదటి ఆరు నెలలు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని, ఆ తర్వాత మరో సంవత్సరం పాటు తల్లిపాలు ఇవ్వడం తల్లి బిడ్డల ఆరోగ్య సంరక్షణకు రక్షణ కవచం లాంటిదని జిల్లా సంక్షేమ అధికారిని జే స్వర్ణలత లేనినా పేర్కొన్నారు. స్థానిక భద్రాద్రి కొత్తగూడెం బస్టాండ్ లోని తల్లి పాలిచ్చే గదిని లాంఛనంగా ప్రారంభించి బాలింతలకు తల్లిపాల అవశ్యకతపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిని మాట్లాడుతూ ప్రసవించిన మొదటి గంటలోపే తల్లిపాలు ఇవ్వడాన్ని ప్రారంభించేలా తల్లులకు సహకారం అందించాలని, తల్లిపాలే నవజాత శిశువును అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయని, బిడ్డ పుట్టినప్పటి నుండి ఆరు నెలల నిండే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించడం, ఈ ఆరు నెలల్లో బిడ్డ ఎదుగుదల మరి అభివృద్ధికి అవసరమైన పోషకాలన్ని తల్లిపాలలోని లభిస్తాయని, ఇలాంటి ఇతర పదార్థాలు తినిపించకుండా, త్రాగించకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నప్పుడు మాత్రమే తల్లి బిడ్డల ఆరోగ్య భద్రత ఉంటుందని పేర్కొన్నారు. మారుతున్న కాలానుగుణంగా బిడ్డ పుట్టిన వెంటనే తేనే, పంచదార లాంటి మూఢనమ్మకాలు నమ్మకుండా ముర్రుపాలె ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం అర్బన్ సిడిపిఓ, సూపర్వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది, మహిళా సాధికారిత జిల్లా బృందం, ఆర్టీసీ డిపో మేనేజర్, ఆర్టీసీ సిబ్బంది, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.




# పరిశుభ్రమైన పరిసరాలే సీజనల్ వ్యాధులకు చెక్

**-ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ శిరీష సూచన**



**వెల్దుర్తిమండల ప్రతినిధి,ఆగస్టు 01 (తెలంగాణ పత్రిక):**
సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ శిరీష సూచించారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, విరేచనాలు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె తెలిపారు. మండల వ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ సీజనల్ వ్యాధుల నివారణపై సూచనలు అందిస్తున్నారని డాక్టర్ శిరీష తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండనీయకుండా చూడాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు. జ్వరం, దగ్గు, విరేచనాలు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే స్వయంగా మందులు వాడకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలని ఆమె సూచించారు. ప్రజల సహకారంతోనే సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని, ఆరోగ్య సిబ్బంది సూచనలను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ శిరీష కోరారు.

# చర్మకారుల చలో కలెక్టరేట్ జయప్రదం చేయాలి

**-ఇళ్ల స్థలాలు, చర్మకారుల కాంప్లెక్స్ నిర్మాణంపై ఆగస్టు 3న కలెక్టర్‌కు వినతిపత్రం**



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 1 (ప్రజా ప్రతినిధి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్మకారుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 3న నిర్వహించనున్న “చర్మకారుల చలో కలెక్టరేట్” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చర్మకారుల సంఘ రాష్ట్ర జేఏసీ కన్వీనర్ కూసపాటి శ్రీనివాస్ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జిల్లా చర్మకారుల సంఘాల ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక తీర్మానాలు ఆమోదించారు. జిల్లా వ్యాప్తంగా ఇల్లు లేని చర్మకారులందరికీ ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని, జిల్లా కేంద్రంలోని సూర్యా ప్యాలెస్ ఎదురుగా చర్మకారుల కాంప్లెక్స్ కోసం కేటాయించిన స్థలంలో ఆధునిక కాంప్లెక్స్ నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే చర్మకారుల సంక్షేమానికి సంబంధించిన మరో మూడు ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆగస్టు 3న జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్ కార్యక్రమంలో అందజేయనున్నట్లు కూసపాటి శ్రీనివాస్ మాదిగ తెలిపారు. జిల్లాలోని చర్మకారులందరూ, లిడ్‌క్యాప్ ద్వారా శిక్షణ పొందిన చర్మకారులు పెద్ద సంఖ్యలో హాజరై చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వేలేటి వెంకటేశ్వరరావు, యాతాకుల రాజేశ్వరి, ఇనుముల ఇర్మియ, దాసరి సారధి, లక్ష్మి, రమేష్, శ్రీనివాస్, దేవుడు రాంబాబు, తేనేటి రాంబాబు, వలస సీతారాములు, పర్లపల్లి మల్లికార్జున్, రొడ్డ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా విజన్



## రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. తుకారాంజీకి ఘన స్వాగతం



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 01, తెలంగాణ పత్రిక



తెలంగాణ హైకోర్టున్యాయమూర్తి, రాజన్న సిరిసిల్ల జిల్లా పరిపాలన న్యాయ మూర్తి జస్టిస్ ఎన్. తుకారాంజీ శనివారం జిల్లా పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి, జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి బి. పుష్పలత, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం జస్టిస్ ఎన్. తుకారాంజీ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన న్యాయ, పరిపాలనా అంశాలపై సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సిరిసిల్ల, వేములవాడ సీనియర్ సివిల్ న్యాయమూర్తులు పి. లక్ష్మణాచారి, అజయ్ కుమార్ జాదవ్, సిరిసిల్ల జూనియర్ సివిల్ జడ్జి జి. మేఘన, ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దార్ మహేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## శంషాబాద్ లో వ్యక్తి అదృశ్యం

రాజేంద్రనగర్ ప్రతినిధి ఆగస్టు 01 తెలంగాణ పత్రిక.




వ్యక్తి అదృష్టమైన సంఘటన శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నాడు చోటుచేసుకుంది. శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ హౌస్ ఇన్స్పెక్టర్ వై సురేందర్ రెడ్డి తెలియజేసిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ లోని కడప జిల్లా పెద్ద చౌటపల్లి గ్రామానికి చెందిన పల్లగిరి రాజా మోహన్ రెడ్డి తన భార్య జమ్మలమడుగు దామిని తో కలిసి శంషాబాద్ ముచ్చింతల్ గ్రామంలో ఓ ఇంట్లో సంవత్సరం నుండి అద్దెకు ఉంటున్నారు . దామిని ముచ్చింతల్ లోని జిమ్స్ మెడికల్ కళాశాలలో పీజీ రెండవ సంవత్సరం విద్యనభ్యసిస్తుంది. బాబును చూసుకుంటూ రాజమోహన్ రెడ్డి ఇంటి వద్దనే ఉండేవాడు. శుక్రవారం నాడు రాత్రి 8 గంటల సమయంలో పాలమాకుల గ్రామానికి ఇంటి ఓనర్ శివ ప్రసాద్ తో పాటు కార్ లో వెళ్లి తిరిగి ఇంటికి వచ్చారు. శివప్రసాద్ ఫుడ్ ను ఇంట్లో పెట్టి వస్తానని చెప్పి తిరిగి వచ్చి చూసేసరికి రాజమోహన్ రెడ్డి కనిపించలేదు ఈ విషయాన్ని తన భార్య దామిని కి తెలపడంతో చుట్టుపక్కల ప్రాంతాలలో వెతికిన బంధువులను సంప్రదించిన ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ప్రారంభించారు.

## నాంపల్లి వెంకటేశ్వరస్వామి సన్నిధిలో భక్తులకు అన్నదానం

**-సేవా కార్యక్రమాన్ని అభినందించిన భక్తులు**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 01,తెలంగాణ పత్రిక



నాంపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి విచ్చేసిన భక్తులు, ప్రజలకు ఉచిత అన్నప్రసాదం (అన్నదానం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చిన వందలాది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి నిర్వాహకులను అభినందించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, మానవసేవే మాధవసేవ అనే భావనతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. భక్తులకు అన్నప్రసాదం అందించడం ద్వారా తమకు ఎంతో ఆత్మసంతృప్తి కలిగిందన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని పలువురు భక్తులు ఆకాంక్షిస్తూ నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆవుల లక్ష్మారెడ్డి, సాన్విక రెడ్డి, ఎర్ర అనిల్ రెడ్డి, గూడ రాజు, మంజేటి శ్రీనివాస్, ఆవుల నాగరాజు తదితరులు పాల్గొని అన్నదాన సేవలో పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిపూర్వక వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# ఏరియా జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ వెంకట రమణ

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక ఆగష్టు 1

కొత్తగూడెం ఏరియా నూతన జనరల్ మేనేజర్‌గా సీహెచ్ వెంకట రమణ (శనివారం)న బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, నూతన జనరల్ మేనేజర్‌కు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీహెచ్ వెంకట రమణ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాల సాధన, కార్మికుల భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సమష్టి కృషితో కొత్తగూడెం ఏరియాను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఏరియాలోని గనులు, అనుబంధ విభాగాల్లో భద్రతా ప్రమాణాలను మరింత పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఉత్పాదకత పెంపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు.



అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేసి సంస్థ ప్రగతికి తమవంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్వో టు జీఎం ఎం. గోవిందరావు ,ఏజీఎం (ఫైనాన్స్) బిబత్స ఏజీఎం (సివిల్) సి. హెచ్. రామకృష్ణ డీజీఎం (ఐఈడీ) యోహాన్ , ఏరియా ఇంజనీర్ -- వి. రామకృష్ణ సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు (సీఎంఓఏఐ) జనరల్ సెక్రటరీ ఉపేందర్ పర్సనల్ మేనేజర్ తిరుపతి సీనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్ తౌర్యా



, కె. రాజారాం వీకేసీమ్ మేనేజర్ మురళి , డీజీఎం స్టోర్స్ మైనేని శ్రీనివాస్ ,ఇతర విభాగ అధికారులు, ఉద్యోగులు, పాల్గొని నూతన జనరల్ మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## సిఎంఆర్ ఎఫ్ చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, ఆగస్టు 1 (తెలంగాణ పత్రిక):

జగిత్యాల పట్టణంలోని మోతే రోడ్డు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణానికి చెందిన 80 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన 80 లక్షల 60 వేల రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సహాయ నిధితో బీద మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక చేయూత కల్గుతుందని అన్నారు. రాష్ట్రంలో అత్యధిక సీఎం సహాయ నిధి చెక్కులు జగిత్యాలకు మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలోనే జిల్లాలో ఏకైక మెడికల్ కళాశాల జగిత్యాల నడి బొడ్డున ఉందని మెడికల్ కళాశాలకు అవసరమైన



600 పడకల కన్నా జగిత్యాల మెడికల్ కాలేజీ కి మాత్రం 800 పైగా పడకలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఏకైక ట్రామా సెంటర్ జగిత్యాలకు మొదటిగా రానుందని పాత బస్టాండ్ లో ట్రామా వెల్ నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య ఏఎంసి చైర్మెన్ గడ్డం



నారాయణ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జెల్ల రవీందర్ బండ శంకర్ గట్టు సతీష్ గిరి నాగభూషణం గోలి శ్రీనివాస్ కొత్త మోహన్ సమీండ్ల శ్రీనివాస్ అడువాల లక్ష్మణ్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు దుమాల రాజ్ కుమార్ కౌన్సిలర్లు అరవ లక్ష్మీ దయాల చంద్రకళ శంకర్ శరత్ బీరం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## గాజులరామారంలో రూ.2.02 కోట్ల సీసీ రోడ్లకు నిధులు


**-పనులను త్వరలో ప్రారంభిస్తాం: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, ఆగస్టు1:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం డివిజన్‌లో పెద్దమ్మ నగర్ బస్తీ, అయ్యప్ప కాలనీల్లో రూ.2.02 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు నిధులు మంజూరైన నేపథ్యంలో బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ శనివారం అధికారులతో కలిసి పర్యటించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని 278వ డివిజన్ గాజులరామారంలోని పెద్దమ్మ నగర్ బస్తీకి రూ.1.12 కోట్లు, అయ్యప్ప కాలనీకి రూ.90 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించి ప్రతిపాదిత పనులను పరిశీలించారు. ఎమ్మెల్యేకు పెద్దమ్మ నగర్ బస్తీ, అయ్యప్ప కాలనీ వాసులు గజమాలలు వేసి, డప్పుల వాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానికులతో సమావేశమైన ఆయన అభివృద్ధి పనులపై వివరాలు వెల్లడించారు. ఈ



సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. పెద్దమ్మ నగర్ బస్తీలో ఇప్పటికే భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి పైప్‌లైన్, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. తాజాగా సీసీ రోడ్ల నిర్మాణానికి కూడా నిధులు మంజూరయ్యాయని, అన్ని పరిపాలనా ప్రక్రియలు పూర్తిచేసి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత వర్షాకాలంలో బురద, నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రతి కాలనీ, బస్తీకి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.



ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా స్థానికులు తమ ప్రాంత అభివృద్ధికి చేపడుతున్న చర్యలపై హర్షం వ్యక్తం చేస్తూ కేపీ వివేకానంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఏఈ కళ్యాణ్, జలమండలి డీజీఎం రవి నాయక్, మేనేజర్ రమ్య భారతి, పెద్దమ్మ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి. నవీన్, ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు మనోహర్, కోశాధికారి ఆరిఫ్, పరశురాం, సంయుక్త కార్యదర్శి జీ. శ్రీనివాస్, సంఘ సభ్యులు గోపాల్, ప్యాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయ్ రామ్‌రెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, మహిళా నాయకురాలు రాధాభాయి, ఇతర నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దుండిగల్‌లో ఎల్లమ్మ తల్లి వార్షికోత్సవాల్లో...శంభీపూర్ కృష్ణ

తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, ఆగస్టు 1:

దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ తండా-2లో నిర్వహించిన శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు శంభీపూర్ కృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ తండా-2లో గల శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు శంభీపూర్ కృష్ణ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లమ్మ తల్లి వార్షికోత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆలయ ఉత్సవాలు ప్రజల ఐక్యతకు, సామాజిక సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ వేడుకలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేసే గొప్ప వేదికలని అన్నారు. ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో సోదరభావాన్ని బలోపేతం చేయడంలో ఆలయ ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొని భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శంభీపూర్ కృష్ణకు స్వాగతం పలికి, ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కోర్ర శంకర్ నాయక్, వార్డు



అధ్యక్షుడు కోర్ర అమర్ సింగ్ నాయక్, నాయకులు రవీందర్ నాయక్, ఎల్. శంకర్ నాయక్, ప్రవీణ్ నాయక్, హనుమంతు నాయక్, ప్రేమ్ సింగ్ నాయక్, విజయ నాయక్, సోము నాయక్, మదన్ నాయక్, నరేందర్ నాయక్, అమర్ సింగ్ నాయక్, కుమార్ నాయక్, శివా నాయక్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేములవాడలో ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు

-అనుమతులు లేకుండా నడుస్తున్న రెండు దయాగ్నస్టిక్ సెంటర్లకు నోటీసులు జార్నీ
-జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్స్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 01,తెలంగాణ పత్రిక



రాజన్న సిరిసిల్ల జిల్లావేములవాడ పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులు, దయాగ్నస్టిక్ స్కానింగ్ సెంటర్లలో జిల్లా వైద్య ఌ ఆరోగ్య అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రుల్లో రోగులకు అందించే సేవలు, నిబంధనల అమలు, పారిశుద్ధ్యం, అవసరమైన అనుమతులు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. రోగులకు అందించే సేవలకు సంబంధించిన రుసుముల పట్టికను అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల పేర్లను బోర్డుపై ప్రదర్శించాలని ఆదేశించారు. అలాగే బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ ధ్రువీకరణ పత్రం, కాలుష్య నియంత్రణ అనుమతులు, సిబ్బందికి సంబంధించిన అర్హత పత్రాలు తనిఖీ అధికారులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన ఫైర్ సేఫ్టీ పరికరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.స్కానింగ్ సెంటర్లలో గర్భిణులకు సేవలు అందించే సమయంలో పీసీపీఎన్డీటీ (ౄజ్రూచీఱ) చట్టం నిబంధనలను కచ్చితంగా పాటించాలని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, గర్భంలోని శిశువు ఆడా మగా అనే వివరాలు వెల్లడించడం పూర్తిగా చట్టవిరుద్ధమని హెచ్చరించారు. స్కానింగ్‌లు అనుమతి పొందిన రేడియాలజిస్టులు లేదా గైనకాలజిస్టులు మాత్రమే నిర్వహించాలని సూచించారు. స్కానింగ్ కేంద్రాల్లో "ఇక్కడ లింగ నిర్ధారణ చెప్పబడదు" అనే బోర్డును స్కానింగ్ గది, వేచివుండే హాలులో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే ప్రతిరోజు నిర్వహించిన స్కానింగ్‌లకు సంబంధించిన ఫారం-ఎఫ్ వివరాలను అదే రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ప్రతి నెల 5వ తేదీలోగా సంబంధిత పత్రాలను జిల్లా వైద్య ఌ ఆరోగ్య శాఖ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు.తనిఖీల సందర్భంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రెండు డయాగ్నస్టిక్ సెంటర్లను గుర్తించి వాటి యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసినట్లు డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించే ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సెక్షన్ ఇన్‌చార్జి మహేష్‌తో పాటు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మహదేవపురంలో రూ.2.41 కోట్ల సీసీ రోడ్లకు శంకుస్థాపన

తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, ఆగస్టు 1:



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మహదేవపురం డివిజన్‌లో రూ.2 కోట్ల 41 లక్షల 50 వేల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శనివారం శంకుస్థాపన చేశారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గాజులరామారం సర్కిల్ పరిధిలోని మహదేవపురం డివిజన్‌లో రూ.2.41 కోట్ల 50 వేల వ్యయంతో మంజూరైన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శనివారం ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహదేవపురం డివిజన్‌లోని షిరిడి హిల్స్‌కు రూ.60 లక్షలు, సాయిగ్రామ్‌కు రూ.22 లక్షలు, బాలయ్య నగర్‌కు రూ.47.50 లక్షలు, కమలమ్మ కాలనీకి రూ.20 లక్షలు, రావి నారాయణరెడ్డి నగర్‌కు రూ.92 లక్షలతో మొత్తం రూ.2.41 కోట్ల 50 వేల విలువైన సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టడం ప్రాంత అభివృద్ధికి కీలక అడుగని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు చొరవతోనే ఈ నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రోడ్ల లేమితో కాలనీవాసులు ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా వర్షాకాలంలో బురద, నీటి నిల్వలతో రాకపోకలు కష్టసాధ్యమయ్యేవని తెలిపారు. ఈ పనులు పూర్తయిన తర్వాత ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మరో రూ.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు త్వరలోనే శంకుస్థాపనలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మహదేవపురం డివిజన్‌కు తగిన అభివృద్ధి నిధులు కేటాయించలేదని, స్థానిక సమస్యలను పరిష్కరించడంలో అప్పటి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం గడువును ఆగస్టు 10 వరకు పొడిగించిన నేపథ్యంలో, ఇంకా తమ వివరాలను సమర్పించని వారు సంబంధిత బీఎల్‌వోలను సంప్రదించి అవసరమైన పత్రాలను అందజేయాలని స్థానికులకు సూచించారు. ఈ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంలో కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి డీసీసీ ఉపాధ్యక్షుడు కూన శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ మాజీ కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సీహెచ్ బుచ్చిరెడ్డి, దుగ్యాల ప్రసాద్, షిరిడి హిల్స్, సాయిగ్రామ్, బాలయ్య నగర్, కమలమ్మ కాలనీ, రావి నారాయణరెడ్డి నగర్ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిద్ధిపేట జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడిగా పరకాల తిరుపతిరెడ్డి

-వరుసగా మూడోసారి నియామకం
-పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా
- పరకాల తిరుపతిరెడ్డి
-జిల్లాలో రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ

నంగునూరు ఆగస్టు 1(తెలంగాణ పత్రిక):



సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సీనియర్ నాయకుడు పరకాల తిరుపతిరెడ్డి బీజేపీ కిసాన్ మోర్చా సిద్ధిపేట జిల్లా ఉపాధ్యక్షుడిగా వరుసగా మూడోసారి నియమితులయ్యారు. పార్టీ అధిష్ఠానం ఆయనపై మరోసారి విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించడం పట్ల జిల్లా బీజేపీ శ్రేణులు, కిసాన్ మోర్చా నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఎన్నో సంవత్సరాలుగా గ్రామీణ స్థాయి నుంచి రైతు సమస్యలపై పోరాడుతూ, పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేసినందుకు గుర్తింపుగా ఈ అవకాశం లభించిందని నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, రైతు సంక్షేమ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించడం, పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడంలో తిరుపతిరెడ్డి సేవలు ప్రశంసనీయమని తెలిపారు. ఈ సందర్భంగా పరకాల తిరుపతిరెడ్డి మాట్లా డుతూ, తనపై విశ్వాసం ఉంచి వరుసగా మూడోసారి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, బీజేపీ సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్ ముదిరాజ్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, బస్వాపురం లక్ష్మీనర్సయ్య, జిల్లా అధ్యక్షుడు వల్లపురెడ్డి రజనీకర్ రెడ్డితో పాటు బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకత్వానికి, కార్యకర్తలకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తూ పార్టీ ఆశయాలను గ్రామీణ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీరు, ఎరువులు, విత్తనాల సరఫరా, పంటలకు గిట్టుబాటు ధర, పంట బీమా, రైతు సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై నిరంతరం పోరాడతానని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రతి మండలంలో కిసాన్ మోర్చాను మరింత బలోపేతం చేసి యువ రైతులను పార్టీతో అనుసంధానం చేయడంతో పాటు రైతు సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు, అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హత కల్గిన ప్రతి రైతుకు చేరేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. పరకాల తిరుపతిరెడ్డి నియామకంపై నంగునూరు మండలం, సిద్ధన్నపేట గ్రామం సహా జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో సిద్ధిపేట జిల్లాలో బీజేపీ కిసాన్ మోర్చా మరింత బలోపేతం అవుతుందని, రైతుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# తానూర్‌లో ఘనంగా డాక్టర్ అన్నాభావు సాఠే జయంతి వేడుకలు

-అన్నాభావు సాఠే ఆశయాలు ఆదర్శనీయం::మాజీ సర్పంచ్ మాధవ్ రావ్ పాటిల్



తానూర్:01ఆగస్టు(తెలంగాణ పత్రిక)

మండల కేంద్రంలో ప్రముఖ సంఘ సంస్కర్త, రచయిత, ప్రజాకవి డాక్టర్ అన్నాభావు సాఠే(106) జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.అన్నాభావు సాఠే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, గౌతమ్ బుద్ధుని, చత్రపతి శివాజీ మహారాజ్, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ అన్నాభావు సాఠే సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బాలేరావ్ ఉత్తం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుండ్లిక్, మాజీ సర్పంచులుడి.రాములు,టి.విఠ్ఠల్, ఉప సర్పంచ్ ఫారుక్, కార్యదర్శి, వార్డ్ సభ్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు డి. పోశెట్టి, నాయకులు శివాజీ పాటిల్, పండరి,గొవింద్ పాటిల్, సోమనాథ్,శ్యామ్,భీమ్, గైక్వాడ్ సాయినాథ్,గణేష్, పవార్ సాయినాథ్, యోగేష్,అలాగే అన్నాభావుసాఠే కమిటీ అధ్యక్షుడు చందు వాగ్మారే,ఉపాధ్యాక్షుడు సురేష్ బైల్కం, కోశాధికారి శాయాజీ వాగ్మారే, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు, అన్నదానం చేపట్టారు.

# దుండిగల్‌లో దుర్గమ్మ బోనాల ఉత్సవాలు వైభవంగా



తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, ఆగస్టు1:

దుండిగల్ గ్రామంలో శ్రీ దుర్గమ్మ అమ్మవారి బోనాల మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఘటం, బోనం ఊరేగింపులో మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 296వ డివిజన్ పరిధిలోని దుండిగల్ గ్రామంలో శ్రీ దుర్గమ్మ అమ్మవారి బోనాల మహోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా ఘటం, బోనం ఊరేగింపును నిర్వహించగా గ్రామ వీధులన్నీ భక్తుల జయజయధ్వానాలు, డప్పుల చప్పుళ్లు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఉత్సవాల్లో మాజీ ఎంపీపీ, శ్రీ దుర్గమ్మ ఆలయ కమిటీ చైర్మన్ చిన్నంగి వెంకటేష్, మేడ్చల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు అమరం ముత్యం రెడ్డి, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్, ఆకుల ప్రేమ్‌కుమార్ పటేల్, ఉప్పరి కృష్ణ, దాతరిపల్లి గోపాల్, దొంతి మహేష్ ముదిరాజ్, ఆకుల మధుసూదన్ తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలు ప్రజల ఐక్యతకు, ఆధ్యాత్మిక చైతన్యానికి నిదర్శనమని అన్నారు. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని, గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువత, భక్తులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శంకరపట్నం సమీపంలో స్కూటీ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

**శంకరపట్నం ఆగష్టు 1: తెలంగాణ పత్రిక**



శంకరపట్నం మండలం కొత్తగట్టు జేసీఎం ఫంక్షన్ హాల్ ఎదురుగా శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్ జిల్లా చింతకుంట గ్రామానికి చెందిన భుఖ్య రాములు (55) తన కుమార్తెను కలిసేందుకు నర్సంపేటకు స్కూటీపై వెళ్తుండగా మార్గమధ్యలో వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయనకు కుడి కనుబొమ్మ, కుడి మోకాలు, కుడి చేతి మణికట్టు వద్ద తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ గూడూరి సతీష్ రెడ్డి, పైలట్ మత్తి గోపికృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికులు వెంటనే స్పందించి 108కు సమాచారం ఇవ్వడంతో సకాలంలో వైద్య సహాయం అందింది.

## ఎల్‌నినో ప్రభావం: ఆరుతడి పంటల సాగుతో నష్టాలు తగ్గించుకోవాలి



**శంకరపట్నం ఆగష్టు 1: తెలంగాణ ప్రతీక:**

శంకరపట్నం మండలంలోని ముత్తారం, చింతగుట్ట, కేశవపట్నం, మొలంగూరు, మెట్‌పల్లి గ్రామాల్లో రైతులకు ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించారు. తక్కువ వర్షపాతం నేపథ్యంలో పెసర, మినుము, కంది, వేరుశనగ, మక్కజొన్న వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ సూచించారు. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నప్పుడే వరి సాగు చేపట్టాలని, వర్షపు నీటి సంరక్షణకు ఫార్మ్ పాండ్స్, ఇంకుడు గుంతలను ఈజీఎస్ ద్వారా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఏఈఓలు సునంద, ఆరతి, కీర్తన, తిరుపతి, స్రవంతి రైతులకు సాగు యాజమాన్య పద్ధతులు, వర్షాభావ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.


## ఏజెన్సీ గ్రామాన్ని గాలికి వదిలేశారా

**-ఒక నెలగా తాగునీరు లేదు... అయినా కదలని పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్**



**ఆళ్లపల్లి, ఆగస్టు 1(తెలంగాణ పత్రిక)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం, అభయారణ్యంలో ఉన్న అడవి రామవరం గిరిజన గ్రామపంచాయతీని అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం గురించి పెద్ద పెద్ద మాటలు చెప్పినా, క్షేత్రస్థాయిలో మాత్రం మౌలిక సదుపాయాలు కూడా కరువయ్యాయి. గ్రామంలో తాగునీటి మోటార్ గత ఒక నెలగా పూర్తిగా పాడైపోయి ఉంది. దీనిపై పంచాయతీ కార్యదర్శికి, సర్పంచ్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.మా ఊరికి ఒకే ఒక్క చేతి బోరు ఉంది. ఆడ, మగ, ముసలి, పిల్లలు అందరూ ఆ బోరు దగ్గరికి వెళ్లి భుజాలపై నీళ్లు మోసుకోవాలి. ఇదేనా గిరిజన గ్రామాలకు ప్రభుత్వం ఇస్తున్న న్యాయమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఫోటోలకు, సభలకు మాత్రమే గిరిజన గ్రామాలకు వస్తున్నారని, సమస్యలు పరిష్కరించే దిక్కు లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు.వెంటనే పాడైన తాగునీటి మోటార్ను బాగు చేయించాలి అని గ్రామస్తులు కోరారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

**తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, ఆగస్టు1:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తామని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని శంభీపూర్‌లో ఉన్న తన కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కాలనీల ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని శంభీపూర్‌లో ఉన్న కార్యాలయంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును శనివారం నియోజకవర్గానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా



స్థానికంగా నెలకొన్న పలు ప్రజా సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రాలు అందజేశారు. సమస్యలను ఓర్పుగా విన్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధుల బాధ్యత అని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పౌర సేవలు మెరుగుపడేలా నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ కాలనీలకు చెందిన ప్రతినిధులు తమ ప్రాంతాల్లో నిర్వహించనున్న ధార్మిక, సామాజిక, శుభ కార్యక్రమాలకు హాజరుకావాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఆహ్వానించారు. ఆహ్వానాలను ఆయన స్వీకరిస్తూ వీలైనంత వరకు ప్రతి కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

## మోడిఫైడ్ సైలెన్సర్లతో తిరుగుతున్న ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టిన జిల్లా ట్రాఫిక్ పోలీసులు







**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక ఆగష్టు 1**

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసులు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చుకున్న ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 12 ద్విచక్ర వాహనాలు మోడిఫైడ్ సైలెన్సర్లతో నడుస్తున్నట్లు గుర్తించి, ఆయా వాహనదారులపై మోటారు వాహనాల చట్టం--1988 సెక్షన్ 190(2) ప్రకారం కేసులు నమోదు చేసి జరిమానాలు విధించి వసూలు చేశారు. అనంతరం అన్ని వాహనాలకు అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించి పోలీస్ స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్హెచ్ఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మోడిఫైడ్ సైలెన్సర్ల వినియోగం వల్ల తీవ్రమైన శబ్ద కాలుష్యం ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని, ఇటువంటి మార్పులు చట్టవిరుద్ధమని తెలిపారు. వాహనదారులు కంపెనీ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న సైలెన్సర్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై జిల్లా వ్యాప్తంగా ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రతి అర్హుడు ఓటరుగా నమోదు కావాలి: కొలన్ హన్మంత్ రెడ్డి

**తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, ఆగస్టు 1:**

ఎస్ఐఆర్--2026 ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతి అర్హత కలిగిన పౌరుడు సద్వినియోగం చేసుకుని తన ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 281 రంగా రెడ్డి నగర్ డివిజన్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 281వ డివిజన్ రంగా రెడ్డి నగర్‌లో డీసీసీ ఉపాధ్యక్షుడు డా. శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఎస్ఐఆర్--2026 ప్రత్యేక ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య ంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని సూచించారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు ఉన్న





వారు తమ పేరు, చిరునామా, కుటుంబ వివరాలు, ఇతర వ్యక్తిగత సమాచారం సక్రమంగా ఉందో లేదో పరిశీలించి, అవసరమైతే మార్పులు, చేర్పులు చేసుకోవాలని కోరారు. ఎస్ఐఆర్--2026 ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటు కీలకమని, ఓటరు జాబితాలో పేరు నమోదు చేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని, ఒక్క అర్హుడూ ఓటరు జాబితా నుంచి మిగిలిపోకుండా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు బుయ్యని శివకుమార్, సభ్యుడు మేకల ఎల్లయ్య, డివిజన్ అధ్యక్షుడు జలీల్ ఖాన్, కనకరావు, సిద్ధనోళ్ల సంజీవ రెడ్డి, మాధవి రాణి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు హన్మిరెడ్డి, రాములు, ఎండి గౌస్ పాషా, సురేందర్, కోసరాజు, ఎండి యూసుఫ్, నీల గుప్తా, సంతోష్, దేవేందర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాయికల్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

**జగిత్యాల, ఆగస్టు 1(తెలంగాణ పత్రిక):**

రాయికల్ పట్టణంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చెసి ఓపి ఐపీ సేవలు ల్యాబ్ రికార్డ్స్ మెడికల్ ఫార్మసి తదితర వాటిని పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలను గురించి నేరుగా పేషంట్లని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అటెండెన్స్ బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను కోరారు. వర్షాకాలం వ్యాధుల పట్ల డెంగ్యూ వైరల్ ఫీవర్లకు మందులు అందుబాటులో ఉండేల చూసుకోవాలని కాలం చెల్లిన మెడిసిన్



ఉండకుండ చూసుకోవాలన్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేల ఆరోగ్య కేంద్రం ఆవరణలోని ఉన్న మంచి నీటి సౌకర్యాలను ఎప్పటికప్పుడు నాణ్యమైన వంట సామాగ్రి మంచి భోజనం అందించాలని



సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా ఆస్పత్రి కో-ఆర్డినేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ తహసీల్దార్ ఎంపిడివో ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్దే ప్రధాన అజెండా : సర్పంచ్ వేమూరి సత్యనారాయణ

**మునగాల, ఆగస్టు 1, తెలంగాణ పత్రిక**



మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణ యందు గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ అధ్యక్షతన శనివారం గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ గ్రామసభయందు 2026-27 ఆర్థిక సంవత్సరంకు గాను గ్రామపంచాయతీ ఆదాయ వనరులైనటువంటి కేంద్ర ప్రభుత్వం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నిధులు, గ్రామపంచాయతీ సొంత నిధులు అంచనా వేసి అట్టి నిధులతో 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ తయారుచేసి ఆమోదించనైనది. బడ్జెట్ పంచాయతీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్ ఆధారం చేసుకొని పిఏఐ నందు తక్కువగా స్కోర్ ఉన్నటువంటి ఉమెన్ ఫ్రెండ్లీ, క్లీన్ అండ్ గ్రీన్ అంశాలను పరిగణలోకి తీసుకొని అట్టి అంశాలకు ఎక్కువ నిధులు కేటాయించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామ అభివృద్దే ప్రధాన జెండాగా ముందుకు వెళుతున్నామని ఈ ఆర్థిక సంవత్సరంలో అన్ని రంగాలకు సమతుల్యత పాటిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీ సొంత వనరులతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ రకాల పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకు కృషి చేస్తామని గ్రామంలో ఉన్న సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు ఉపాధి పనులలో అవకాశం కల్పిస్తామని ఇందుకు గ్రామ ప్రజలు మహిళలు యువత సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు షేక్ అజీజ్ మియా పచ్చిపాల అశ్విని వీరబోయిన నరేష్,పంచాయతీ కార్యదర్శి బాలరాజు,వివిధ శాఖల అధికారులు అంగన్వాడి వివికే, వైద్యశాఖ విద్యుత్ శాఖ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలాగే మహిళలు రైతులు యువత గ్రామ పెద్దలు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో దేశాభివృద్ధికి తోడ్పడాలి ఎమ్మెల్యే మల్లారెడ్డి

**-మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ 18వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహణ**

**లిమేడ్చల్, ఆగస్టు 1 తెలంగాణ పత్రిక**





లిమేడ్చల్ నియోజకవర్గం మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆడిటోరియంలో 18వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పట్టభద్రులను అభినందించారు. ఈ సందర్భంగా వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో విద్యను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. విద్యా, సాంకేతిక రంగాల్లో ప్రతిభ కనబరిచిన టాపర్లకు గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేసి ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ, గ్రాడ్యుయేషన్ అనేది విద్యార్థుల జీవితంలో ఒక కీలక మైలురాయి అని పేర్కొన్నారు. విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను అలవర్చుకొని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రపంచ స్థాయిలో ప్రతిభ చాటాలని, నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పట్టభద్రులకు ఆకాంక్షించారు. విద్యార్థుల విజయాల వెనుక తల్లిదండ్రులు, అధ్యాపకుల కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. మల్లారెడ్డి విద్యాసంస్థలు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఆహ్వానితులు పెద్ద సంఖ్యలో పాల్గొని పట్టభద్రులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల పట్టాభిషేకం సందర్భంగా ఆడిటోరియంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

# వన్ వార్డ్ ఎవరీ డే: మేడ్చల్ వార్డులో పౌర సమస్యలపై కమిషనర్ సమీక్ష







**మేడ్చల్, 1 ఆగస్టు తెలంగాణ పత్రిక**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "వన్ వార్డ్ ఎవరీ డే" కార్యక్రమంలో భాగంగా కమిషనర్, జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు మేడ్చల్ సర్కిల్ పరిధిలోని మేడ్చల్ వార్డును సందర్శించి స్థానిక ప్రజలతో సమావేశమై పౌర సమస్యలు, అభివృద్ధి అవసరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రజలు గుంతలతో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు, కొత్త రోడ్ల అభివృద్ధి, ఎన్జీవోస్ కాలనీ--రాఘవేంద్ర నగర్ కాలనీల మధ్య ఓపెన్ నాలాపై వంతెన నిర్మాణం, అవసరమైన ప్రాంతాల్లో బాక్స్ డ్రెయిన్ల ఏర్పాటు, పార్కులు మరియు స్పోర్ట్స్ స్టేడియం అభివృద్ధి, తుమ్మ చెరువు పరిసరాల్లో కొత్త వీధి దీపాల ఏర్పాటు వంటి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా బస్ డిపో సమీపంలో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు, ఎయిర్‌టెక్ యంత్రాల మరమ్మతులు, దోమల నియంత్రణ చర్యల బలోపేతం, తాగునీటి సరఫరా మెరుగుదల, కొత్త యూజీడీ లైన్ల ఏర్పాటు, చెరువుల్లోకి డ్రైనేజీ నీరు చేరకుండా చర్యలు, ఎల్ఆర్ఎస్ సంబంధిత సమస్యల పరిష్కారం వంటి అంశాలపై కూడా చర్చించారు. ప్రజలు ప్రస్తావించిన ప్రతి సమస్యను ప్రాధాన్యతతో పరిశీలించి, సత్వర చర్యలు చేపట్టాలని కమిషనర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో గుర్తించిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి, వార్డు స్థాయి సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, "వన్ వార్డ్ ఎవరీ డే" కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మమేకమై వార్డు స్థాయి సమస్యలను గుర్తించి, వాటికి వేగవంతమైన పరిష్కారం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# కోటగిరిలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి ఘన నివాళులు



**-మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో**

**కోటగిరి తెలంగాణ పత్రిక ఆగస్టు1.**

కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల బిఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆత్మకు శాంతి చేకూరాలని కోటగిరి మండల నాయకులు తరఫున దేవుని వేడుకున్నారు.ఈ సందర్భంగా తెల్ల రవికుమార్ పోయిందన్నారు. ఎవరైనా నమస్కారం పెడితే పెద్ది సుదర్శన్ రెడ్డి నమస్తే పెట్టకపోయినా చాలామంది విమర్శించేవారని గుర్తు చేశారు. టీవీలో పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడినప్పుడు మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన పోరాటాలు సేవలు తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఏనాటికి మరువలేరని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడుటకు ఉద్యమం చేపట్టిన సమయంలో పోలీసులు వాటర్ క్యాన్లు తో కొడితే కుడి కన్ను కనిపించకుండా మాటలు విన్న తెలంగాణ ప్రజలకు చాలా ఆశ్చర్యపోయారాన్నారు. ఆయన తెలంగాణ కోసం శారీర అవయవాలు గాయాలతో , దేహాన్ని కోల్పోయిన మహా గొప్ప వ్యక్తి పెద్ది సుదర్శన్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మోరే కిషన్ ఏత్తొండ దేవేందర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ బొట్టే గజేందర్ కప్ప సంతోష్ నజీర్ గంగా ప్రసాద్ గౌడ్ శంకర్ గౌడ్ గగన్ రుద్రంగి సందీప్ పాషా సుద్దులం తోట విజయ్ మొగులప్ప మండల మైనార్టీ నాయకులు వివిధ గ్రామాల బిఆర్ఎస్ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి వివేక్ పై దుష్ప్రచారం తగదు

**-కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్**



**రామకృష్ణాపూర్ - తెలంగాణ పత్రిక**

రామకృష్ణాపూర్‌లో వర్షాల కారణంగా దెబ్బతిన్న నేషనల్ హైవే--363 సర్వీస్ రోడ్డును, కల్వర్టును తెలంగాణ రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రి చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రత్యక్షంగా పరిశీలించిన సందర్భంగా చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించి సోషల్ మీడియా, వాట్సాప్ వేదికల ద్వారా దుష్ప్రచారం చేయడం అత్యంత హేయమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ రామకృష్ణాపూర్ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ అన్నారు. మాటలను పూర్తిగా వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బీఆర్ఎస్ నాయకులకు తగదని అన్నారు. విమర్శించే వీరు అధికారంలో ఉన్నప్పుడు దీనిని ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. భరత్‌నగర్--దుబ్బపల్లి సర్వీస్ రోడ్డుపై కుర్మపల్లి చెరువు అవుట్‌ఫ్లో కాలువ కారణంగా ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతోందని గతంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి ఎన్ హెచ్ ఎ ఐ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు లేఖ రాశారని గుర్తు చేశారు. సంబంధిత అధికారులు నివేదికలు సమర్పించినప్పటికీ పనులు ప్రారంభంకాకపోవడంతో ఈసారి భారీ వర్షాలకు రోడ్డు మరింతదెబ్బతిందన్నారు.నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి నిరంతరం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ నిధులు, అనుమతులు తీసుకొస్తున్నారని తెలిపారు. సర్వీస్ రోడ్డు, బాక్స్ కల్వర్ట్, లైటింగ్ వంటి పనులు త్వరితగతిన ప్రారంభించేలా మరోసారి కేంద్ర ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్తామని మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. మంత్రి గడ్డం వివేక్ నాయకత్వంలో చెన్నూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగాజరుగుతున్నాయని, క్యాతనపల్లి మున్సిపాలిటీ సమస్యల పరిష్కారానికి మంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షులు పల్లె రాజు, కౌన్సిలర్లు గుర్రం శ్రీనివాస్, దాముక శిరీష, భీమ మల్లేష్, కూతురు ప్రభాకర్, మాజీ కౌన్సిలర్ పోలం సత్యనారాయణ, పట్టణ ఉపాధ్యక్షులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, సృజన ప్రధాన కార్యదర్శులు గోపు రాజం, ఏల్పుల సత్యనారాయణ సోషల్ మీడియా ఇంచార్జ్ బొద్దుల ప్రేమ్ సాగర్, కార్యదర్శులు కునారపు శివ, పైడాకుల శ్రీనివాస్, రాపాక రాజు, భైర మల్లేష్ , వెనిగల శ్రీనివాసరావు మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుర్రం అనిల్ కుమార్ నాయకులు దాముక రమేష్ ఆలేటి వెంకటేశ్, నేరెళ్ల చంద్రయ్య, పందిరి లింగయ్య, కనుకుంట్ల కనకయ్య, కనకం వెంకటేష్, మస్కం సంపత్, రంజిత్ కుమార్, పోగుల లచ్చులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలి

**-ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఐద్వా నాయకురాలు**



**మిర్యాలగూడ ప్రతినిధి//ఆగస్టు 1:(తెలంగాణ పత్రిక):-**

ఎన్.ఎస్.పి క్యాంపు బక్కల్ వాడ హైస్కూల్లో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా మిర్యాలగూడ కమిటీ ఆధ్వర్యంలో సర్వే చేయడం జరిగింది. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఐద్వా నాయకు రాళ్లు ముఖ్యఅతిథిగా పాల్గొన్న. జిల్లా అధ్యక్షురాలు పోలబోయిన వరలక్ష్మి ప్రధాన కార్యదర్శి. పాలడుగు ప్రభావతి. ఐద్వా జిల్లాసహాయ కార్యదర్శి పాదురు గోవర్ధన. మధ్యాహ్నం భోజనం వండుతున్న సమ భావన సంఘం వర్కర్లకు. సరిపడా బిల్లును పెంచాలి. పాఠశాలలో బాత్రూమ్స్ సరిగ్గా లేక బాలబాలికలు ఇబ్బంది పడుతున్నారు. స్కామెంజర్లకు జీతాలు సరిపోక పాఠశాల యాజమాన్యం చాలా ఇబ్బంది పడుతున్నారు ప్రభుత్వం నుంచి వచ్చే రూపాయలు సరిపోవటం లేదు కాబట్టి స్కా స్కావెంజర్లు కు ఇచ్చే అలవెన్స్ లను పెంచాలి. ఇంకా స్కూల్ లలో మంచినీటి సౌకర్యం లేక విద్యార్థిని విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కావున ప్రభుత్వమే ప్రతి స్కూల్ కి మంజీరా వాటర్ సప్లై చేయాలని వారు అన్నారు. విద్యార్థులకు సరిపడా పుస్తకాలు యూనిఫామ్స్, టై, బెల్టులను, అందజేసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు మనుల అరుణ. కొంపల్లి కౌసల్య, ఐద్వా నాయకు రాళ్లు సూదిని కళమ్మ, డి లలిత, పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక



# ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలి

-ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, అవసరమైన మందులు, ఆధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంచాలి

-పరిశుభ్రత, సమయపాలన, రోగుల పట్ల మర్యాదతో సేవలందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలి

-హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశంలో పాల్గొన్న

-ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష






పెద్దపల్లి,ప్రతినిధి ఆగస్టు1 ( తెలంగాణ పత్రిక )

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన, అందుబాటు వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆసుపత్రిలో అవసరమైన సౌకర్యాలు, వైద్య పరికరాలు, మందులు, మానవ వనరులు సమృద్ధిగా ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు అధికారులను ఆదేశించారు.శనివారం పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) సమావేశంలో ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావుతో కలిసి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని ఆసుపత్రి అభివృద్ధి, వైద్య సేవల విస్తరణ, రోగులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ, గతంతో పోలిస్తే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు గణనీయంగా మెరుగుపడ్డాయని, జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు కూడా ఈ ఆసుపత్రి సేవలను వినియోగిస్తున్నారని తెలిపారు. ఈ సేవల ప్రమాణాన్ని మరింత పెంచేందుకు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఆసుపత్రిలో నిర్వహిస్తున్న సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను నిరంతరంగా కొనసాగించాలని, వివిధ రకాల శస్త్రచికిత్సలకు అవసరమైన ఆధునిక వైద్య పరికరాల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని, రోగులకు వైద్యులు సూచించిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ ఛార్జీల సవరణ, మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలకు అనుమతి, అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన మందుల కొనుగోలు, స్పెషలిస్ట్ వైద్యుల నియామకం, ఆరోగ్యశ్రీ బడ్జెట్ సమకూర్చడం, నూతన ఆసుపత్రి భవనం పూర్తైన అనంతరం సీటీ స్కాన్ యంత్రం ఏర్పాటు వంటి అంశాలపై సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. నర్సింగ్ సిబ్బంది కొరత నివారణకు చర్యలు చేపట్టాలని, రోగులకు అందించే డైట్ ఫుడ్ నాణ్యతను ప్రతిరోజూ ఆర్ఎంఓ పరిశీలించాలని, ఆసుపత్రి పరిశుభ్రతను రోజువారీగా తనిఖీ చేయాలని ఆదేశించారు. శానిటేషన్ సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, నర్సింగ్ సిబ్బంది రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. డాక్టర్లు, ఇతర సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని, 36 వారాలు దాటిన గర్భిణులను ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించకుండా తప్పనిసరిగా ఆసుపత్రిలో చేర్చి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో తాగునీటి నాణ్యతను ప్రతి నెల మిషన్ భగీరథ అధికారులతో పరీక్షించించాలని, జిల్లా ప్రారంభ జోక్యం కేంద్రం (డీఈఐసీ) సేవలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. గర్భిణీ స్త్రీలను తీసుకువచ్చే 102 అంబులెన్స్ ప్రతిరోజూ ఉదయం 9.30 గంటలలోపు ఆసుపత్రికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిలో పనిచేసే ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా గుర్తింపు కార్డు ధరించాలని ఆదేశించారు.

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,**

ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చేందుకు ప్రతి విభాగం బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మందులు, వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిధులను ప్రజలకు నేరుగా ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్య తనిస్తూ వినియోగించాలని తెలిపారు. ఆసుపత్రి పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ సూచించారు. ప్రతి వార్డు, ఆపరేషన్ థియేటర్, అత్యవసర విభాగంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి పట్ల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు సానుభూతితో, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఓపీ, ఐపీ విభాగాల్లో రోగులు ఎక్కువసేపు నిరీక్షించాల్సిన పరిస్థితులు రాకుండా సేవలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. మాతా-శిశు ఆరోగ్య సేవలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, 36 వారాలు దాటిన ప్రతి గర్భిణికి అవసరమైన వైద్య సేవలు అందించి సురక్షిత ప్రసవానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఈఐసీ సేవలను మరింత విస్తరించి చిన్నారులకు అవసరమైన ప్రత్యేక వైద్య సేవలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని, ఆసుపత్రి సేవలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కే.శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కాన్ నాజ్ , సెక్రటరీ ఐ ఆర్ సీ ఎస్ పెద్దపల్లి జిల్లా కావేటి రాజగోపాల్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మీసాల సత్యనారాయణ, ప్రెసిడెంట్ జిల్లా మహిళా సమాఖ్య స్వప్న , జిల్లా ఆసుపత్రి ఆర్ యం ఓ డాక్టర్ విజయకుమార్ ,హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు ,పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదంలో నష్టపోయిన ఫోటోగ్రాఫర్ చెన్నం రాజుకు

# మంత్రి సీతక్క పరామర్శ

-రూ.20 వేల ఆర్థిక సాయం హామీ

-ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు చర్యలు

-నిత్యావసర సామాగ్రి కార్పొరేషన్ ద్వారా రుణం ం అందేలా సహకారం



వాజేడు తెలంగాణ పత్రిక ప్రతినిధి కీసరి ప్రసాద్ ఆగస్టు 1

ము లుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమై తీవ్రంగా నష్టపోయిన ఫోటోగ్రాఫర్ చెన్నం రాజును రాష్ట్ర మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క గారు పరామర్శించారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి, ప్రమాదానికి సంబంధించిన వివరాలను చెన్నం రాజును అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అగ్నిప్రమాదం వల్ల ఇల్లు, ఇంట్లోని సామాగ్రి దగ్ధమై తీవ్రంగా నష్టపోయిన చెన్నం రాజుకు మంత్రి సీతక్క గారు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ఆపద సమయంలో బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. తక్షణ సహాయంగా రూ.20 వేల ఆర్థిక సాయం అందజేస్తామని మంత్రి సీతక్క గారు హామీ ఇచ్చారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి శాశ్వత నివాసం కల్పించే దిశగా ప్రభుత్వం నుంచి సహకారం అందేలా చూస్తామని పేర్కొన్నారు. అదనంగా, చెన్నం రాజుకు అవసరమైన నిత్యావసర సామాగ్రి కార్పొరేషన్ ద్వారా రుణం (లోన్) మంజూరయ్యేలా సంబంధిత అధికారులతో మాట్లాడి సహకారం అందిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. అగ్నిప్రమాదం కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబం తిరిగి సాధారణ జీవనం కొనసాగించేలా అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి సీతక్క**

అగ్నిప్రమాదం వంటి దురదృష్టకర ఘటనలతో నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి సీతక్క గారు తెలిపారు. బాధితులకు అవసరమైన ఆర్థిక, గృహ, నిత్యావసర సహాయాలు అందేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్న సమయంలో వారికి అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అని, బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు కూలిన ఇల్లు.. తృటిలో తప్పిన ప్రాణాపాయం

మంగపేట, ఆగస్టు 1 (తెలంగాణ పత్రిక):

ములుగు జిల్లా మంగపేట మండలం పోదుమూరు రెవెన్యూ గ్రామంలోని ఎస్సీవాడలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఓ ఇల్లు కూలిపోయింది. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో లంజపెల్లి నాగేశ్వరావు నివాసం పూర్తిగా నేలమట్టమైంది.అనారోగ్యంతో నాగేశ్వరావు ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లడంతో ఘటన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే ఇంట్లో ఉన్న గృహోపకరణాలు, నిత్యావసర సామగ్రి పూర్తిగా



ధ్వంసమై సుమారు రూ.1.25 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. అలాగే వర్షాల నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను అధికారులు గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టి ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.


## మంత్రి అడ్లూరికి జగిత్యాల బార్ అసోసియేషన్ వినతిపత్రం



జగిత్యాల పట్టణం, ఆగస్టు 1(తెలంగాణ పత్రిక):

తెలంగాణ హైకోర్టు ద్వారా జగిత్యాల జిల్లా కేంద్రంలోని కోర్టు భవన సముదాయానికి అదనంగా ఫ్యామిలీ కోర్ట్ అదనపు మున్సిఫ్ కోర్టు మంజూరు అయ్యాయని వాటి నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం ద్వారా అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేయాలని ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు జగిత్యాల బార్ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందజేశారు. నూతనంగా మంజూరైన కోర్టులు నిర్మాణమై అందుబాటులోకి వచ్చినట్లయితే జిల్లా ప్రజలకు త్వరితగతిన కేసులు పరిష్కారం సత్వర న్యాయం జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఆర్థిక న్యాయ శాఖ మంత్రుల దృష్టికి తీసుకెల్లి నిధులు మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం సమర్పించిన వారిలో జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్ర నర్సయ్య ఉపాధ్యక్షుడు మర్రిపెల్లి సత్యప్రకాశ్ ప్రధాన కార్యదర్శి అందే మారుతి రాచకొండ శ్రీరాములు ఇమ్మడి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ఉప సర్పంచ్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇంచార్జిగా జోగు నగేష్



మాడుగులపల్లి//నల్గొండ//ఆగస్టు 1:(తెలంగాణ పత్రిక):-

మాడుగుల పల్లి మండలం మాచనపల్లి గ్రామానికి చెందిన గ్రామ ఉపసర్పంచ్ నగేష్ ఉప సర్పంచ్ల ఫోరం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి నల్గొండ జిల్లా ఇంచార్జిగా ఎన్నికయ్యారు. వారికి నేడు ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తిక్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ఉప సర్పంచ్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతానన్నారు. ఉప సర్పంచ్లకు రూ. 5 వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నా ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని అన్నారు.

## నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కేడిసీసీ బ్రాంచ్ మేనేజర్ మార్కండేయ డిఈ వేణుగోపాల్ రావు



జగిత్యాల ఆగస్టు 1(తెలంగాణ పత్రిక):

కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ జగిత్యాల బ్రాంచ్ కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బ్రాంచ్ మేనేజర్ మార్కండేయ డెవలఫమెంట్ ఎగ్జిక్యూటివ్ వేణుగోపాల్ రావ్ కు జగిత్యాల సహకార సంఘం చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ జగిత్యాల కేడిసీసీ బ్యాంకు బ్రాంచి పరిధిలో జగిత్యాల కల్లెడ సారంగాపూర్ సొసైటీలు వున్నాయని బ్రాంచ్ మేనేజర్ మరియు డిఈ లకు సొసైటీల అభివృద్ధికి ఖాతదారులకు మరింత కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘాల కార్యదర్శులు గాజెంగి వేణు జజాలా శేఖర్ లైశెట్టి శివకుమార్ సిబ్బంది రాజేష్ నవీన్ అజయ్ నారాయణ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# నీట మునిగిన వరి పొలాల పరిశీలించిన వరి పరిశోధన శాస్త్రవేత్తల బృందం

కోటగిరి తెలంగాణ పత్రిక ఆగస్టు 1.

ప్రాంతీయ చెరకు మరియు వరి పరిశోధన శాస్త్రవేత్తల బృందం కోటగిరి మండలం లోని సైలంపూర్ గ్రామ పరిధిలో, పోతంగల్ మండలంలోని తిర్మలాపూర్ గ్రామ పరిధిలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. పొలంలో నిల్వ ఉన్న నీటిని వీలయినంత తొందరగా తీసి వేయాలని, పూర్తిగా కుళ్ళి పోయిన మొక్కలను గుర్తించి, మళ్ళీ నాటుకోవాలని సూచించారు. పసుపు రంగు లోకి ఆకులు మారినట్లు గమనించినట్లయితే 2% యూరియా లేదా 19.19.19 ను 5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.కాండం తొలిచే పురుగు నివారణకు,



నాట్లు వేసిన 25 రోజులకు రైతులు తప్పనిసరిగా కార్బోఫ్యూరాన్ 3జి ఎకరాకు పది కిలోల చొప్పున వేసుకోవాలి. పొలం లో ఎకరాకు 5-6 చొప్పున లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకుని పురుగుల ఉనికి ని గమనిస్తూ ఉండాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు కర్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు లేదా క్లోరంట్రానిలిప్రోల్ 60 మిల్లీలీటర్లు ఒక ఎకరాకు చొప్పున పిచికారి చేసుకోవాలి. బ్యాక్టీరియా ఎండాకు తెగులు లక్షణాలు గమనించిన వెంటనే, పొలంలో యూరియా వేయడం ఆపివేయాలి. వ్యాధి సోకిన మడి నుండి కింది పొలానికి నీరు వెళ్లకుండా చూడాలి వ్యాధి మరింత ఉధృతి అవ్వకుండా ప్లాంటమైసిన్ 80 గ్రాములు మరియు కాపర్ ఆక్సి క్లోరైడ్ 600 గ్రాములు ఒక ఎకరాకి పిచికారి చేసుకోవాలి. . ఈ క్షేత్ర సందర్శన లో శాస్త్రవేత్తలు సమత పరమేశ్వరి, ఎం సాయి చరణ్, బి. మంజు భార్గవి, రమ్య రాథోడ్, ఏఈఓ గౌస్, రైతులు గంగారాం,విట్టల్, వీరబాబు,ఇస్మాయిల్ మరియు బీర్కూర్ సంతోష్ పాల్గొన్నారు.

# భద్రాచలం కోర్టు అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

-భద్రాచలం జ్యుడీషియల్ కోర్టును సందర్శించిన జిల్లా & సెషన్స్ జడ్జి జి. ప్రేమలత

భద్రాచలం, ఆగస్టు 1 (ప్రజా సమస్య/ప్రత్యేక ప్రతినిధి):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జిల్లా ఒ సెషన్స్ జడ్జి శ్రీమతి జి. ప్రేమలత శనివారం భద్రాచలంలో అధికారిక పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాచలం జ్యుడీషియల్ కోర్టును సందర్శించి కోర్టు ఆవరణ, న్యాయస్థానాల పనితీరు, మౌలిక సదుపాయాలు, వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం న్యాయాధికారులు, భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమై కోర్టు నిర్వహణ, మౌలిక వసతులు, న్యాయవాదుల సమస్యలు, కోర్టు అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి కోర్టుకు వచ్చే న్యాయవాదులు, కక్షిదారుల సౌకర్యార్థం కోర్టు ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటు చేయాలని జిల్లా జడ్జిని కోరారు. దీనిపై స్పందించిన ఆమె ప్రస్తుతం ఉన్న షెడ్ ను స్వయంగా పరిశీలించారు. అలాగే కోర్టులో అవసరమైన సిబ్బంది నియామకం, పెరుగుతున్న కేసుల భారాన్ని దృష్టిలో ఉంచుకుని అదనపు జిల్లా ఒ సెషన్స్ కోర్టు ఏర్పాటు చేయాలని



చేసిన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అంశాలను గౌరవ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా జడ్జి భద్రాచలం స్పెషల్ సబ్‌జైలును సందర్శించి ఖైదీలకు కల్పిస్తున్న వసతులు, ఆహార నాణ్యత, మౌలిక సదుపాయాలు, ఉచిత న్యాయ సహాయ సేవలను పరిశీలించారు. జైలులో ఖైదీలు చేపడుతున్న అగరబత్తి తయారీ కార్యక్రమాన్ని అభినందించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. తదుపరి మానవసేవ వాలంటరీ ఆర్గనైజేషన్ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జిల్లా జడ్జి అక్కడి వృద్ధులను ఆప్యాయంగా పలకరించి పండ్ల రసం అందజేశారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకొని, వృద్ధాశ్రమంలో



అందిస్తున్న సేవలను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. ఈ పర్యటనలో భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శివ నాయక్, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా భవాని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, జాయింట్ సెక్రటరీ తాత లలిత, లేడీస్ ప్రతినిధి తరుణి, హైకోర్టు న్యాయవాది పీవీ కృష్ణమాచారి, సీనియర్ న్యాయవాదులు, పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల కోసం కృషి చేసిన వ్యక్తి నకిరికంటి అంజయ్య 11వ వర్ధంతి సభ

-నకిరికంటి అంజయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ ప్రతినిధి//ఆగస్టు 1:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ ప్రాంతంలో కార్మిక ఉద్యమాన్ని నడిపి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేసి అరుణ కిరణం లా నిలిచిపోయిన కామ్రేడ్ నకిరేకంటి అంజయ్య ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఈరోజు మిర్యాలగూడ సిపిఎం పార్టీ కార్యాలయంలో సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ నకిరేకల్ అంజయ్య 11వ వర్ధంతి సభను నిర్వహించడం జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడలో పేద



ప్రజానీకం కోసం అందులో కార్మిక వర్గం కోసం కృషి చేసిన నాయకులలో నకిరేకంటి అంజయ్య ఒకరు అని వారి యొక్క సేవలను కొనియాడారు. మిర్యాలగూడలో ఎఫ్సిఐ, బజార్ ముఠా,, భవన నిర్మాణ కార్మికులు, హమాలీ యూనియన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అంజయ్య చేసిన కృషి అభినందనీయమని అటువంటి త్యాగల గుర్తుగా నేటితరం కమ్యూనిస్టు కార్మిక ఉద్యమాన్ని బలపరచాలని వారు పిలుపునిచ్చారు. ప్రతి మనిషికి చావు పుట్టుక సర్వసాధారణమని ఈ మధ్యకాలంలో మనము ఎవరికోసం, ఏ వర్గం కోసం నిలబడ్డామనేది మనల్ని చరిత్రలో నిలబెడుతుందని అలా నిలబడ్డ వారు ఒక్క కమ్యూనిస్టు పార్టీ నాయకులేనని వారి సేవలను తర తరాలు గుర్తుంచుకొని వారి ఆశయ మార్గంలో పయనించడానికి కంకణబద్ధులు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సిపిఎం సీనియర్ నాయకులు నూకల జగదీష్ చంద్ర,,సిపిఎం వన్ టౌన్ టూ టౌన్ కార్యదర్శులు మల్లు గౌతంరెడ్డి, భావండ్ల పాండు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రవి నాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, నాయకులు తిరుపతి రామూర్తి, సత్యనారాయణ రావు, అరుణ, గోవర్ధన, దేశిరం,రమేష్ బాబు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎస్పీ







-నేరాల నియంత్రణకు గ్రామాల్లో విజిబుల్ పోలిసింగ్ పై దృష్టి సారించాలి.

-ప్రజలకు మరింత చేరువగా పోలీస్ విధులు ఉండాలి.

-మత్తు పదార్థాలు, సైబర్ నేరాల నివారణకు గ్రామీణ యువతలో చైతన్యం పెంపొందించాలి.

-జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే..

వేములవాడ రూరల్, ఆగస్టు, 01, తెలంగాణ పత్రిక.

నేరాల నియంత్రణే లక్ష్యంగా గ్రామాల్లో విజిబుల్ పోలిసింగ్ మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువయ్యేలా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులకు సూచించారు.శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఎస్పీ పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి వారు ప్రదర్శించిన పరేడ్, డ్రిల్, లాఠీ డ్రిల్లు పరిశీలించి అభినందించారు.ఈసందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు,పెట్రోలింగ్ నిర్వహణ, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై ప్రత్యేకంగా ఆరా తీశారు.ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీసు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులను ఆదేశించారు.కేసుల విచారణలో త్వరగతిన దర్యాప్తు,సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాత దృక్పథం అవసరమని తెలిపారు.పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అభినందించారు.విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు, విపివోలు గ్రామాల్లో పర్యటిస్తూ ఎలాంటి సంఘటన జరిగినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం చేరేలా సమాచార వ్యవస్థను పటిష్ఠం చేయాలని సూచించారు. అలాగే గ్రామీణ ప్రాంత ప్రజలకు, యువతకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.బ్లూ కోల్ట్, పెట్రోకార్ సిబ్బంది గ్రామాల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి అనుమానితులు, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతర నిఘా ఉంచి తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు.నేను సైతం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో వాటి పాత్రను తెలియజేస్తూ సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు.ఎస్పీ వెంట డీఎస్పీ శ్రీనివాసులు , సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ వెంకట్రాజం, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడు ఒక మొక్క నాటాలి ఎంపీడీఓ శశికళ



ఇల్లంతకుంట, ఆగస్టు 1, తెలంగాణ పత్రిక

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి పౌరుడు ఒక మొక్క నాటాలని ఇల్లంతకుంట ఎంపీడీఓ శశికళ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని గంగాధర క్షేత్ర ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, సర్పంచ్ మామిడి రాజు, ఉప సర్పంచ్ మూగు నాగరాజు శర్మతో పాటు పాలకవర్గ సభ్యులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మామిడి రాజు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని కోరారు. ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఎంపీడీఓ శశికళ తెలిపారు.

# పుట్టిన ప్రతి బిడ్డకు ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వాలి

– నంగునూరు సర్పంచి సనాదుల బాలపోచయ్య

-ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నంగునూరులో అవగాహన ర్యాలీ



నంగునూరు, ఆగస్టు 1(తెలంగాణ పత్రిక):

పుట్టిన ప్రతి బిడ్డకు ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వాలని నన్ను నువ్వు సర్పంచి సనాదుల బాలపోచయ్య చెప్పారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సిద్దిపేట జిల్లా నంగునూరు గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బాలపోచయ్య, ఐసీడీఎస్ సూపర్వైజర్ టి.రమాదేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యత, శిశువుల ఆరోగ్యానికి తల్లిపాలు అందించే పోషక విలువలు, తొలి ఆరు నెలల పాటు శిశువులకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాల్సిన అవసరం, తల్లి మరియు బిడ్డ ఆరోగ్య రక్షణలో తల్లిపాల పాత్రపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నితీష్ కుమార్, సీఏ లావణ్య, నంగునూరు అంగన్వాడీ ఉపాధ్యాయులు తోట పద్మ, గాజుల ఇందిర, ఎం.లక్ష్మి, ఎస్.లక్ష్మి, రాజమల్లవ్వ, విమలతో పాటు వివిధ గ్రామాల అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించి తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై చైతన్యం కల్పించనున్నట్లు తెలిపారు. తల్లిపాలు శిశువుల సంపూర్ణ ఆరోగ్యానికి, మానసిక వికాసానికి ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు.



## డయాగ్నోస్టిక్ కేంద్రాలు పీహెచ్‌సీలను తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్ఓ

మంగపేట,ఆగస్టు 01(తెలంగాణ పత్రిక)





ములుగు జిల్లా మంగపేట మండలంలో ఐటిడిఎ డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. క్రాంతి, డా. అఖిల, ఐటిడిఎ ప్రోగ్రామ్ మేనేజర్ మహేందర్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నరసింహారావు కలిసి సుమా డయాగ్నోస్టిక్స్ (మంగపేట), అరవింద్ డయాగ్నోస్టిక్స్ (తిమ్మంపేట), ఫస్ట్ ఎయిడ్ సెంటర్ (రాజ్‌పేట)లను శనివారం తనిఖీ చేశారు. డయాగ్నోస్టిక్ కేంద్రాల నిర్వాహకులకు రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, ప్రయోగశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రిజిస్టర్డ్ వైద్యులు సూచించిన పరీక్షలను మాత్రమే నిర్వహించాలని సూచించారు. తిమ్మంపేటలోని అరవింద్ డయాగ్నోస్టిక్స్ ప్రయోగశాల రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించి నోటీసు జారీ చేసి, లోపాలను సరిదిద్దేందుకు గడువు విధించారు.రాజుపేటలోని ఆర్‌ఎంపీ వైద్యుడికి రోగులకు ఇంజెక్షన్లు ఇవ్వవద్దని, అవసరమైన చికిత్స కోసం సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి పంపించాలని ఆదేశించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. క్రాంతి మంగపేట, బ్రాహ్మణపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. కాలానుగుణ వ్యాధుల నివారణ చర్యలు, వైద్య శిబిరాల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## ప్రజల దహార్తి తీర్చడమే మా లక్ష్యం.. సర్పంచ్ మల్లుగారి పద్మ



గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఆగస్టు 01

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మల్లు గారి పద్మ ప్రజల దహార్తి తీర్చడమే లక్ష్యంగా ఏ ఒక్కరికి నేటి సమస్య ఉండ కూడదని దృఢనిశ్చయంతో 8 వ వార్డు పరిధిలోనీ ఎంఆర్ సి బిల్డింగ్ వద్ద దాదాపు మూడు లక్షల రూపాయలతో నూతన బోరు, మోటర్ పంప్ సెట్ బిగించి మూడు గల్లీలకు నీరు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ బోరు మోటర్ తో కాలనీవాసులకు పల్లెదవ ఖానా గర్ల్స్ హాస్టల్ ఎంఆర్సి భవనాలకు త్రాగునీరు అందించనున్నారు 3 ఫేస్ కరెంటు ఇబ్బందులను తొలగించడానికి గాను ట్రాన్స్ఫారం ఏర్పాటు చేసిన సర్పంచ్ మల్లుగారి పద్మకు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ తాగునీటి ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లుగారి పద్మ ఉప సర్పంచ్ లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి స్థానిక వార్డు సభ్యులు రెడ్డిమల్ల రాజనర్సు, సుంకరి ప్రశాంత్, దేవసాని కృష్ణ, ఏగదండి స్వామి, గ్యార దేవరాజు ఎగదండి అర్జున్, హాస్టల్ వార్డెన్ గాదం భూదేవి, ఏఎన్ఎం బండ విజయ ఆశ కార్యకర్తలు రోడ్డ లాహిరి, జ్యోతి.రాణి, విజయ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నార్లు

## వాగ్దేవి స్కూల్లో ముందస్తు స్నేహితుల దినోత్సవ వేడుకలు



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్ట్ 1, తెలంగాణ పత్రిక.

చందుర్తి మండలం జోగాపూర్ గ్రామ వాగ్దేవి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు స్నేహితుల దినోత్సవ (ఫ్రెండ్షిప్ డే) వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ రాజూరి సద్గుణ చారి ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్షిప్ డే రక్షా కంకణమును కట్టుకొంటూ, ఫ్రెండ్షిప్ డే శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా సద్గుణా చారి మాట్లాడుతూ... స్నేహం అనేది జీవితంలో అత్యంత విలువైన బంధం. నిజమైన స్నేహితులు సంతోషంలోనే కాదు, కష్ట సమయంలో కూడా మనకు అండగా నిలుస్తారు. స్నేహితులు మనకు ధైర్యాన్ని, ఆనందాన్ని, మంచి ఆలోచనలను అందిస్తారు. మంచి స్నేహితులను ఎంచుకోవడం, వారి నమ్మకాన్ని కాపాడుకోవడం, ప్రతి ఒక్కరి బాధ్యత. ఈ స్నేహితుల దినోత్సవం సందర్భంగా మన స్నేహితులను గౌరవిద్దాం అని పిల్లలకు వివరించారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయినీలు పిల్లలకు శుభాకాంక్షలు తెలియజేశారు.. అదేవిధంగా పాఠశాల విద్యార్థులు స్నేహబంధం గురించి ఆంగ్లంలో ఉపన్యాసించారు.. తర్వాత విద్యార్థిని విద్యార్థుల ఆటపాటలతో సంతోషంగా గడిపారు.. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# బీర్పూర్ రోళ్లవాగు ప్రాజెక్టును సందర్శించిన

-టి. జీవన్ రెడ్డి, దావ వసంత

బీరుపూర్, ఆగస్టు 1(తెలంగాణ పత్రిక):





బీర్పూర్ మండల కేంద్రంలోని రోళ్లవాగు ప్రాజెక్టును బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి మాజీ జడ్పీ ఛైర్ పర్సన్ దావ వసంత పర్యటించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 0.25 టీఎంసి వాటర్ సరిపోవడం లేదని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి నెలలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇట్టి ప్రాజెక్టును 1 టిఎంసిగా మంజూరు చేశారని గుర్తు చేశారు. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురువడంతో వచ్చిన వర్షాలతో ఈ ప్రాంతమంత సస్య శ్యామలం అవుతుండే నీరు నిల్వ ఉంటుండే భూగర్భ జలమట్టం పెరుగుతుండే అని అధికారులు గేట్లు అమర్చలేకపోవడంతో అధికారుల నిర్లక్ష్యం ఇక్కడ స్పష్టంగా కనబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే ధర్మపురి ఎమ్మెల్యే మంత్రిగా ఉన్నారని దీనికి వారు పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. రైతాంగానికి ఎరువులు సమకూర్చాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నదని విద్యుత్ ఎరువులు గతంలో కెసిఆర్ ప్రభుత్వం 24 గంటల విద్యుత్ అందించారాని విద్యుత్తు నిరంతరం సమకూర్చాలని ఎరువులు సమస్య ఉత్పన్నం కాకుండ చూడాలని ప్రభుత్వానికి జీవన్ రెడ్డి సూచించారు. అనంతరం డిఈ ఈఈ లతో ప్రాజెక్టులో ఉన్న సమస్యలను తెలియజేశారు. వారి వెంట మాజీ ఎంపీపీలు కొలుముల రమణ మసర్తి రమేష్ నేరెళ్ల సుమన్ చేరుపూరి సుభాష్ సత్యంరావు గుడిసె జితేందర్ యాదవ్ ముక్క శంకర్ ఆకుల రమేష్ ఆకుల రాజిరెడ్డి తేలు రాజు రిక్కల ప్రభాకర్ చిక్కుల రవి చంద్రయ్య సయిండ్ల శ్రీనివాస్ బదినపల్లి శంకర్ తదితరులు ఉన్నారు.

## రైతుల ధాన్యం బకాయిల కోసం వేములవాడ పట్టణంలో బీజేపీ ఆందోళన

-రోడ్డుపై వడ్లు పోసి నిరసన..
-నేతల అరెస్టు.. అస్వస్థతకు గురైన సిరికొండ శ్రీనివాస్..
-సీఐపై డీఎస్పీకి ఫిర్యాదు..

వేములవాడ, ఆగస్టు, 01, తెలంగాణ పత్రిక.





రైతులకు రావాల్సిన ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో శనివారం వేములవాడలో చేపట్టిన భారీ ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. జిల్లాలో ఇటీవల వెలుగుచూసిన వడ్ల కుంభకోణం కారణంగా అనేక మంది రైతులకు ఇప్పటికీ ధాన్యం సొమ్ము అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆరోపించిన బీజేపీ నాయకులు, చెక్కపల్లి బస్టాండ్ సమీపంలో భారీ ధర్నా నిర్వహించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు రైతులకు రావాల్సిన బకాయిలను తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిరసనకారులు వరి ధాన్యాన్ని రహదారిపై పోసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. తెలంగాణ చౌక్ ప్రాంతమంతా నినాదాలతో మారుమోగగా, ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పట్టణ సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రైతుల హక్కుల కోసం శాంతియుతంగా పోరాటం చేస్తుంటే ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని బీజేపీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరని, రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆందోళన కొనసాగుతున్న సమయంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ ఒక్కసారిగా అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోవడంతో అక్కడ కలకలం రేగింది. వెంటనే స్పందించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను వేములవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. రైతుల సమస్యలపై పోరాడుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం కార్యకర్తలను ఆందోళనకు గురిచేసింది. మరోవైపు, నిరసన సందర్భంగా తమ కార్యకర్తలపై పోలీసులు అనవసరంగా బలప్రయోగం చేశారని ఆరోపిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐపై ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మీడియాతో మాట్లాడిన గోపి, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న కార్యకర్తలపై పోలీసులు దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ, ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై స్పందించిన డీఎస్పీ శ్రీనివాసులు, ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, వీడియో ఆధారాలను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతుల ధాన్యం బకాయిల అంశంపై బీజేపీ చేపట్టిన ఆందోళన, పోలీసుల జోక్యం, నేతల అరెస్టులు, సిరికొండ శ్రీనివాస్ అస్వస్థత, అనంతరం సీఐపై ఫిర్యాదు వంటి పరిణామాలతో శనివారం వేములవాడలో రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా మారింది.

# ఫిట్స్‌తో ట్రాక్టర్‌పై నుంచి కిందపడి డ్రైవర్ దుర్మరణం

-పొలం దున్నుతుండగా జరిగిన దుర్ఘటన
-ఘనపూర్ గ్రామంలో హృదయవిదారక ఘటన.
-కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు

నంగునూరు, ఆగస్టు 1(తెలంగాణ పత్రిక):



రోజూ కుటుంబ పోషణ కోసం శ్రమించే ఓ డ్రైవర్... వ్యవసాయ పనిలో సాయం చేస్తూ విధి వక్రించడంతో ప్రాణాలు కోల్పోయాడు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఘనపూర్ గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన గ్రామస్థులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. ఘనపూర్ గ్రామానికి చెందిన బత్తుల బాపురాజు (39) వృత్తిరీత్యా డ్రైవర్. కుటుంబ పోషణ కోసం కష్టపడి పనిచేసే ఆయన, శుక్రవారం వ్యవసాయ భూమిలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న సమయంలో అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో ట్రాక్టర్‌పై నుంచి కిందపడిపోయాడు. దురదృష్టవశాత్తు ట్రాక్టర్ వెనుక ఉన్న కేజ్ వీల్స్ ఆయన శరీరంపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి రైతులు, గ్రామస్థులు వెంటనే స్పందించి బాపురాజును సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రి, తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ వార్త తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాపురాజు సౌమ్య స్వభావం కలిగిన వ్యక్తిగా గ్రామంలో మంచి పేరు సంపాదించుకున్నారని గ్రామస్థులు గుర్తుచేసుకున్నారు. కుటుంబ బాధ్యతల కోసం నిరంతరం శ్రమించే ఆయన అకాల మరణం గ్రామ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మృతుడి కుమారుడు బత్తుల సాయి చరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ టి. వివేక్ తెలిపారు. ఈ విషాద ఘటన మరోసారి వ్యవసాయ పనుల్లో భద్రతా జాగ్రత్తల ప్రాధాన్యతను గుర్తుచేస్తోంది. ముఖ్యంగా ఫిట్స్ వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ట్రాక్టర్లు, భారీ యంత్రాలను నడిపేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు, నిపుణులు సూచిస్తున్నారు. ఒక కుటుంబానికి ఆధారంగా నిలిచిన వ్యక్తిని కోల్పోవడంతో ఆ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది.

# గోదావరి వరద శాంతించాలని ప్రత్యేక పూజ

-చీకుపల్లి--పెద్దగొల్లగూడెం దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డును పరిశీలిన...
-రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క.

వాజేడు ఆగస్టు 1 తెలంగాణ పత్రిక



గోదావరి వరద శాంతించాలని శనివారం వాజేడు మండలం లోని ముళ్ళకట్ట - పూసూరు వంతెన వద్ద రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ,జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వస్సల్ టోప్పో లతో కలిసి పరిశీలించి గోదావరి వరద శాంతించాలని ప్రత్యేక పూజ చేశారు. అనంతరం చీకుపల్లి -- పెద్దగొల్లగూడెం గ్రామాల మధ్య ఇసుకవాగు వంతెన వద్ద భారీ వర్షాలకు దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డును పరిశీలించి, పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గోదావరి నది వరద ప్రవాహంపై అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, బ్యాక్ వాటర్ ద్వారా గ్రామాలు కాలనీలు ముంపుకు గురైతే వెంటనే ఆ కుటుం బాలను పునరా వాస కేంద్రా లకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఏ ఎస్ పి మనన్ భట్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి,ఆర్డీవో కృష్ణవేణి, తహసిల్దార్, ఎం పి డి ఓ, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15 నాటికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ తొలి జత యూనిఫాంలు అందించాలి

-ప్రతి స్వయం సహాయక సంఘానికి రూ.15 లక్షలకు పైగా బ్యాంక్ లింకేజ్ రుణం అందేలా ప్రణాళిక రూపొందించాలి

-ప్రతి వి.ఓ పరిధిలో రెండు ఫామ్‌పాండ్లు, ప్రతి ఎస్‌హెచ్‌జీ మహిళ ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలి

-పాఠశాల యూనిఫాంల కుట్టింపు, స్వయం సహాయక సంఘాల పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి,ప్రతినిధి ఆగస్టు, 1 ( తెలంగాణ పత్రిక )

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తొలి జత పాఠశాల యూనిఫాంలను ఆగస్టు 15 నాటికి తప్పనిసరిగా అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాఠశాల యూనిఫాంల కుట్టింపు, పంపిణీ, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలపై సెర్ప్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షఅధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తొలి జత యూనిఫాంలను ఈ నెల 15వ తేదీలోగా అందించేలా అన్ని చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని గురుకుల, రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులకు ఇప్పటికే యూనిఫాంల పంపిణీ పూర్తయిందని, నిర్ణీత గడువులో నాణ్యమైన యూనిఫాంలను అందించిన స్వయం సహాయక సంఘాల మహిళలను అభినందించారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా ఎలాంటి జాప్యం లేకుండా యూనిఫాంలు అందించాలని సూచించారు.స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్థిరత్వానికి బ్యాంక్ లింకేజ్ రుణాల సకాల చెల్లింపులు అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఏ సంఘం కూడా నిరర్థక ఆస్తి (ఎన్‌పీఏ)గా మారకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి స్వయం సహాయక సంఘానికి రూ.15 లక్షలకు పైగా బ్యాంక్ లింకేజ్ రుణం లభించేలా అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.సూపర్ ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామ సంఘం (వి.ఓ) పరిధిలో కనీసం రెండు ఫామ్‌పాండ్లు నిర్మించేలా చర్యలు చేపట్టాలని, ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలి ఇంటిలో ఒక ఇంకుడు గుంత ఉండేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. భూగర్భ జలాల పెంపుకు ఇంకుడు గుంతలు, ఫామ్‌పాండ్ల నిర్మాణం ఎంతగానో ఉపయోగపడుతుందని మహిళలకు వివరించాలని ఆదేశించారు.ప్రతి 10 వేల గ్రూపుల క్లస్టర్‌కు ఒక బుక్‌కీపర్‌ను ఏర్పాటు చేసి వారికి అవసరమైన శిక్షణ అందించాలని కలెక్టర్ సూచించారు. సంఘాల ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించేందుకు బుక్‌కీపర్ల సామర్థ్యాన్ని మరింత పెంపొందించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు డీఆర్‌డీఏ రవీందర్, స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్ దుర్గాప్రసాద్, ఏపీఎంలు, సెర్ప్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ బడులు







-కాంగ్రెస్ హయంలో పేద విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన..

-గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యం అయిన విద్యాసంస్థలు..

-రూ. 12 కోట్లతో ప్రభుత్వ బడుల్లో అభివృద్ధి కార్యక్రమాలు..

-నూతన బస్సు డిపోతో పెరగనున్న రవాణా సౌకర్యాలు..

-కాంగ్రెస్ సర్కారులో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు..

-ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు..

పెద్దపల్లి, ప్రతినిధి ఆగస్టు 1 ( తెలంగాణ పత్రిక )

పెద్దపల్లి మండలంలోని రంగాపూర్ ప్రభుత్వ పాఠశాలల పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాధికారులతో మరియు స్థానిక నాయకులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావుశెంకుస్థాపన చేశారు ముందుగా పెద్దపల్లి మండలం లోని తుర్కల మద్దికుంట గ్రామంలో పెద్దపల్లి నుండి చొప్పదండి వరకు అదనపు నూతన బస్సును స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించి తదుపరి పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో హాస్పిటల్ సూపరిండెంట్, హాస్పిటల్ అభివృద్ధి కమిటి సభ్యులతో కలిసి ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేద విద్యార్థులకు మెరుగైన విద్యాభ్యాసం అందుతుందని రూ. 12 కోట్లతో పెద్దపల్లి పట్టణంలో మరియు మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మండలంలోని రంగాపూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో రూ. 26 లక్షలతో పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రూ. 20 లక్షల నిధులతో విద్యార్థులకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసుకోవడం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రభుత్వ బడులను అభివృద్ధి చేస్తున్నారని కానీ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేసే ఉపాధ్యాయులు గొప్ప చదువులు చదువుకొని నైపుణ్యం కలిగిన వారని వారందరూ తమ విద్యార్థుల పట్ల ప్రేమతో మేలుగుతున్నారని దానికి నిదర్శనమే మొన్న వచ్చిన పదోవ తరగతి ఫలితాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలతో పోటీ పడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలు అభివృద్ధి చెందుతున్నాయని బడుల్లో మధ్యాహ్న భోజనంతో పాటు విద్యార్థుల ఆకలి తీర్చేందుకు టిఫిన్ కూడా అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని గుర్తు చేశారు. విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులపై ఉంటుందని వారందరూ పూర్తి బాధ్యతాయుతంగా ఉండాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారులు, హాస్పిటల్ సూపెరడెంట్,ఆర్టీసీ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ వైస్ చైర్మన్, స్థానిక కౌన్సిలర్, సర్పంచ్లు, పట్టణ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, సిటీ కేబుల్ ఎండీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






## నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్



ముధోల్:01ఆగస్టు(తెలంగాణ పత్రిక)

పేకాట ఆడుతున్న నలుగురుని శనివారం పట్టుకొని అరెస్టు చేసినట్లు ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గన్నోర గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు దాడులు చేసినట్లు తెలిపారు. దీంతో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేయగా నలుగురు పేకాట రాయుళ్ల వద్ద నుండి రూ.2510, మొబైల్ ఫోన్ లను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆ సాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## సకాలంలో తరలించి ప్రాణాలు కాపాడిన 108 అంబులెన్స్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది ఆగస్టు 01.:



అంబులెన్స్ అంటేనే ఆపదలో ఆదూకునేఆపద్భందువు,ఎక్కడ ఏ అత్యవసర పరిస్థితి ఏర్పడిన ముందుగా గుర్తొచ్చేది 108 అంబులెన్స్, ఎలాగైనా ప్రాణం కాపాడుతుందని, కోన ఊపిరిలో ఉన్న ప్రాణిని కూడా ధైర్యాన్ని ఇచ్చే ఉపాకారీ,అలాంటి సాహసమే జరిగింది. వివరాల్లోకి వెళ్తే ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం, పాప్కాపురం గ్రామానికి చెందిన యువ రైతు వేల్పుల నవీన్ 27 సంవత్సరాలు వ్యవసాయ పనులు నిమిత్తం తన పొలంలో కలుపు మందు చల్లడానికి పొలం వద్దకు వెళ్ళాడు,అయితే మందు బస్తా లేపుతున్న క్రమంలో బస్తా కింద ఉన్న నాగుపాము కుడి చేయి మధ్య వేలి మీద కాటు వేయగా,క్షణాల్లో తేరుకున్న నవీన్ పక్కకు జరిగి చూడగా వెంట పడగా పరుగులు తీసి ఇంటి వద్దకు చేరుకొని తన మిత్రుని సహాయంతో ఆసుపత్రికి చేరుకోగా,బాధితుడిని పరీక్షించిన వైద్యులు విషపాము కాటుకు,లక్షణాలు కనిపించగా మెరుగైన వైద్యసేవల ములుగు జిల్లా ఆసుపత్రికి రిఫర్ చెయ్యగా అంబులెన్స్ సిబ్బంది ఎమర్జెన్సీ రెస్పాన్స్ కేర్ ఆఫీసర్ డాక్టర్ వినయ్ సూచన మేరకు ఈ ఏం టి శివలింగంప్రసాద్ ప్రీ హాస్పిటల్ కేర్ మేనేజ్మెంట్ నిర్వహిస్తూ,బాధితుని గుండె వేగాన్ని, నాడి ప్రసరణ,ఆక్సిజన్ లెవెల్ ను మానిటర్ చేస్తూ కావాల్సిన మందులు,గ్లూకోసులు అందిస్తూ , ధైర్యం చెప్తూ సకాలంలో ఆసుపత్రికి చేర్పించి ప్రాణాలను కాపాడారు.జరిగిన ఘటనను వైద్యులకు వివరించి ఆసుపత్రిలో చేర్పించారు.ఈ ఘటనలో అంబులెన్స్ సిబ్బంది ఈఏంటి శివలింగంప్రసాద్,పైలట్ ఉదయ్.బాధితుని కుటుంబ సభ్యులు ఉన్నారు.

## వెంకటాపూర్‌లో పోచమ్మ బోనాల మహోత్సవం

-భక్తిశ్రద్ధలతో పాల్గొన్న వంగ రాజేశ్వర్ రెడ్డి



నంగునూరు, ఆగస్టు 1(తెలంగాణ పత్రిక):

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం వెంకటాపూర్ గ్రామంలో శనివారం పోచమ్మ బోనాల మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువ పారిశ్రామిక వేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సిద్దిపేట నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులు, పాడి పంటలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. భక్తులు, మహిళలు, యువత, పెద్దలు, గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో హాజరై భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. గ్రామ ప్రజలు వంగ రాజేశ్వర్ రెడ్డికి స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంగ రాజేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులే తనకు బలమని, ప్రజాసేవే తన లక్ష్యమని పేర్కొన్నారు.



# ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెంచాలి

-నాణ్యమైన వైద్య సేవలతో ఓపీ సంఖ్య పెంచాలని వైద్య సిబ్బందికి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిల్ ఆదేశాలు



వెల్దుర్తిమండల ప్రతినిధి,ఆగస్టు 01 (తెలంగాణ పత్రిక): ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యశాఖ మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిల్ సూచించారు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో శనివారం తూప్రాన్ డివిజనల్ పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికారులు, ఆరోగ్య అధికారులు, పీహెచ్‌సీ సిబ్బందితో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన డాక్టర్ అనిల్, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాపించే అవకాశం ఉన్నందున ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా ప్రతి వైద్య సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రత, నిల్వ నీటి తొలగింపు, డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఆరోగ్య సూచనలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. ఓపీ (అవుట్ పేషెంట్) సంఖ్య పెరిగేలా ప్రజల్లో ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకాన్ని పెంపొందించాలని, రోగులకు మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని సూచించారు. అవసరమైన మందులు, వైద్య సేవలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ హాస్టళ్లలోని వంటశాలలు, ఆహార నిల్వ గదులను తరచూగా తనిఖీ చేసి పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా నిర్వాహకులకు అవసరమైన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆరోగ్య భద్రత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. తూప్రాన్ డివిజన్‌లో ఆరోగ్య సూచికలను మరింత మెరుగుపరిచేందుకు ప్రతి వైద్యాధికారి కార్యాచరణ ప్రణాళికతో పనిచేయాలని, ప్రజారోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా సేవలందించాలని డాక్టర్ అనిల్ సూచించారు. ఈ సమావేశంలో వెల్దుర్తి మండల వైద్యాధికారి డాక్టర్ శిరీష, డాక్టర్ సౌజన్య, చేగుంట, మనోహరాబాద్ నర్సింగ్ మండలాల వైద్యాధికారులు, సూపర్వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు (మీఎల్గా), టీబీ సూపర్వైజర్లు, ఆర్బీఎస్కే (=దీశా) బృందాల సభ్యులు, ఇతర ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# బడి బయట టీచర్ లోపల బినామీ

-విద్యార్థులకు చదువే కరువు

అల్లపల్లి ఆగస్టు 1 (తెలంగాణ పత్రిక)



మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏజెన్సీ అడవి రామవరం గ్రామపంచాయతీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో టీచర్ బాధ్యతారాహిత్యంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆదివాసి, గిరిజన విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన టీచర్ స్కూల్ కు సకాలంలో రావడం లేదని ఆరోపించారు. స్థానికంగా ఉన్న ఒక వ్యక్తిని బినామీ టీచర్ గా పెట్టి నెలసరి వేతనం ఇచ్చి, అసలు టీచర్ మర్కోడు మరియు చుట్టుపక్కల గ్రామాల్లోని స్కూళ్ల చుట్టూ తిరుగుతూ కాలం గడుపుతున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు.మా పిల్లల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారు. స్కూల్ లో పాఠాలు సరిగా జరగడం లేదు. టీచర్ ఎఫ్.ఆర్.ఎస్ వేసుకొని బయట తిరుగుతున్నారు అని గ్రామస్తులు వాపోయారు.ఈ అంశంపై ఎంఈఓ ను వివరణ కోరగా, అలాంటిది ఏమీ లేదని స్పష్టం చేశారు. స్కూల్లో టీచర్ టైం కు ఉండాల్సిందేనని, బినామీ టీచర్లకు ప్రభుత్వం నుండి ఎలాంటి వేతనాలు చెల్లించడం లేదని తెలిపారు.ఈ ఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి, మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లోని స్కూళ్లలో విద్యా బోధన ఎలా సాగుతోందో, టీచర్లు ఎలా విధులు నిర్వర్తిస్తున్నారో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు. తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు.

# బోయినిపల్లి మినీ స్టేడియానికి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలి

-మంత్రి వాకిటి శ్రీహరికి బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వినతి

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1,తెలంగాణ పత్రిక


రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో ప్రతిపాదిత మినీ స్టేడియం నిర్మాణానికి ఆర్థిక అనుమతులు (ఫైనాన్షియల్ అప్రూవల్) లభించిన నేపథ్యంలో, నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అవసరమైన పరిపాలనా అనుమతులు వెంటనే మంజూరు చేయాలని బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్య, క్రీడలు & యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మినీ స్టేడియానికి ఆర్థిక అనుమతులు మంజూరు



కావడంలో సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వానికి బోయినిపల్లి మండల ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పరిపాలనా అనుమతులు కూడా మంజూరైతే మినీ స్టేడియం నిర్మాణ పనులు వెంటనే ప్రారంభమై త్వరగా పూర్తయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ స్టేడియం అందుబాటులోకి వస్తే బోయినిపల్లి మండల యువతకు మెరుగైన క్రీడా సదుపాయాలు లభించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. అందువల్ల ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని మినీ స్టేడియం నిర్మాణానికి అవసరమైన అన్ని పరిపాలనా అనుమతులను త్వరితగతిన మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రెసిడెంట్ బోయినిపల్లి మండల్ కాంగ్రెస్ పార్టీ కొమ్మనబోయిన సుధీన్ యాదవ్ ,కాంగ్రెస్ నాయకులు, మండల ప్రజలు విజ్ఞప్తి చేశారు.

# మిర్యాలగూడ మండల వ్యాప్తంగా ఎరువుల దుకాణాలల్లో తనిఖీలు

మిర్యాలగూడ ప్రతినిధి//ఆగస్టు 1:(తెలంగాణ పత్రిక):- నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండల పరిధిలోని అన్ని రిటైలర్ హోల్సేల్ ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. దుకాణాలలో అవుట్లెట్లు తమ వద్ద పెండింగ్లో ఉన్న ఈ-పాస్ స్టాక్ రసీదులను వెంటనే పూర్తి చేయాలని మిర్యాలగూడ మండల వ్యవసాయ అధికారి రుషీయేంద్ర మణి అన్నారు. మిర్యాలగూడ పట్టణం మండలంలో రిటైల్ హోల్సేల్ ఎరువుల దుకాణాల్లోకి ఆకస్మికంగా తనిఖీ చేసి పెండింగ్ ఉన్న ఇ పాస్ రసీదులను గుర్తించి ప్రతి స్టాక్ స్వీకరణ అనంతరం ఇ పాస్ యంత్రంలో స్టాక్ రసీదులను



ఎప్పటికప్పుడు నమోదు చేసి పూర్తి చేయడం తప్పనిసరి అన్నారు. ఏట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్ లేకుండా 100% పూర్తి చేయాలని అన్నారు. తనిఖీల సమయంలో పెండింగ్లో ఉన్న ఇ పాస్ రసీదులను గుర్తించినట్లయితే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. మండలంలోని అన్ని రిటైలర్లు హోల్సేల్ డీలర్లు వెంటనే తమ ఈపాస్ నమోదు వివరాలను పరిశీలించి పెండింగ్లో ఉన్న రసీదులను అన్ని పూర్తి చేయవలసిందిగా సూచించారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించని రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సబ్సిడీ లభించదని ఎరువులు తీసుకోలేరు అన్నారు. అదేవిధంగా ఎల్ఈఓ ప్రభావం కొనసాగుతున్నందున తక్కువ నీటితో పండే పంటలు వేయాలన్నారు.

# తల్లిపాలు బిడ్డ జీవితానికి వరం

-ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 01,తెలంగాణ పత్రిక

తల్లిపాలు ప్రతి శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమని, బిడ్డ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అత్యంత బలమైన పునాదిగా నిలుస్తాయని జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీ రాజం తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆగస్టు 1 నుంచి 7 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేములవాడ అర్బన్ మండలంలోని శాత్రాజుపల్లి కేంద్రాన్ని సందర్శించిన జిల్లా సంక్షేమ అధికారి అక్కడ గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న ఆహార పదార్థాలు, పాలు, గుడ్ల సరఫరా, వాటి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ప్రసవం జరిగిన తొలి గంటలోనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం అత్యంత ముఖ్యమని తెలిపారు. మొదటి కొన్ని రోజులు వచ్చే పసుపు రంగు ముర్రుపాలు (కొలస్ట్రం) బిడ్డకు తొలి టీకాలా పనిచేస్తాయని, వాటిలో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉండి శిశువు రోగనిరోధక శక్తిని పెంచుతాయని వివరించారు. బిడ్డకు నిర్ణీత సమయానికి కాకుండా ఆకలి సంకేతాలు చూపినప్పుడల్లా తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఈ కాలంలో నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు.బిడ్డ రొమ్మును సరిగా పట్టుకునేలా (ప్రాపర్ లాచ్) చూసుకోవడం వల్ల తల్లికి నొప్పి తగ్గి, బిడ్డకు తగినంత పాలు అందుతాయని తెలిపారు. పాలిచ్చే సమయంలో తల్లి ప్రశాంతంగా ఉండాలని, పోషకాహారం తీసుకోవాలని, పాలు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు,



గుడ్లు, తగినన్ని నీళ్లు తీసుకోవడం వల్ల పాల ఉత్పత్తి మెరుగుపడుతుందని చెప్పారు.రాత్రి వేళల్లో కూడా శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల ప్రొలాక్టిన్ హార్మోన్ పెరిగి పాల ఉత్పత్తి అధికమవుతుందని పేర్కొన్నారు. ఇంటి పనుల్లో భర్తతో పాటు కుటుంబ సభ్యులు సహకరించి బాలింతకు తగిన విశ్రాంతి కల్పించాలని సూచించారు.మొదట్లో పాలు తక్కువగా వస్తున్నాయని ఆందోళన చెందకుండా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది లేదా నిపుణుల సలహాలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీ రాజం సూచించారు.

# రాన్‌పై మహా దాడికి అమెరికా-ఇజ్రాయెల్ సిద్ధం?..

మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా భారీ వైమానిక దాడులకు సిద్ధమవుతున్నట్లు ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థలు అమెరికా అధికారులను ఉటంకిస్తూ వెల్లడించాయి. ఈ వారాంతంలోనే దాడులు జరిగే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి..మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా భారీ వైమానిక దాడులకు సిద్ధమవుతున్నట్లు ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థలు అమెరికా అధికారులను ఉటంకిస్తూ వెల్లడించాయి. ఈ వారాంతంలోనే దాడులు జరిగే అవకాశం ఉందని వార్తలు వచ్చినప్పటికీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటివరకు తుది ఆమోదం ఇవ్వలేదని సమాచారం. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈ పరిణామాలపై ఉత్కంఠ నెలకొంది అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఇరాన్ సైనిక కార్యకలాపాలకు, పాలనా వ్యవస్థకు కీలకంగా ఉన్న విద్యుత్ కేంద్రాలు, చమురు శుద్ధి కర్మాగారాలు, ఇంధన మౌలిక సదుపాయాలే ప్రధాన లక్ష్యాలుగా దాడి చేయవచ్చని సమాచారం. ఈ దాడుల ద్వారా ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని, ఆర్థిక బలాన్ని బలహీనపరచాలన్నది అమెరికా-ఇజ్రాయెల్ వ్యూహంగా తెలుస్తోంది. అయితే, అధ్యక్షుడి తుది నిర్ణయం వెలువడకముందు లక్ష్యాలపై వ్యాఖ్యానించేందుకు పెంటగాన్ అధికారులు నిరాకరించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని సోమవారం (ఆగస్టు 03) అంతర్జాతీయ మార్కెట్లు ప్రారంభమయ్యేలోపు ఈ ఆపరేషన్‌ను ముగించాలని అమెరికా అధికారులు చర్చించినట్లు సమాచారం. ముఖ్యంగా చమురు ధరలు, ఇంధన సరఫరాలపై తీవ్ర ప్రభావం పడకుండా చర్యలు తీసుకోవాలనే అంశంపై చర్చలు జరిగినప్పటికీ, తుది కాలపరిమితిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఇక ఈ ప్రణాళికల గురించి ఇజ్రాయెల్‌కు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. వాషింగ్టన్‌తో సమన్వయం కొనసాగుతోందని తెలిపినా, ఇరాన్‌పై పూర్తిస్థాయి సైనిక చర్యలను తిరిగి ప్రారంభించే అంశంపై ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఓ ఇజ్రాయెల్ అధికారి వెల్లడించారు. కొత్త దాడిలో పాల్గొనాలని తమకు ఇప్పటివరకు అధికారిక ఆదేశాలు అందలేదని కూడా ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం (జూలై 31) క్యాంప్ డేవిడ్‌లో అధ్యక్షుడు ట్రంప్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ సైనిక ప్రణాళికలపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. వైట్ హౌస్‌లోని కొందరు అధికారులు దాడులను వ్యతిరేకించినప్పటికీ, ట్రంప్ మాత్రం ఇరాన్‌పై అత్యంత కఠిన చర్యలకు సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వెలువడ్డాయి. మరోవైపు, ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యాన్ని అడ్డుకోవడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైట్ హౌస్ పునరుద్ఘాటించింది, అధ్యక్షుడు ఆదేశిస్తే వెంటనే చర్యలు తీసుకునేందుకు అమెరికా సైన్యం పూర్తిగా సిద్ధంగా ఉందని పెంటగాన్ వెల్లడించింది.ఇదిలా ఉండగా, అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు పాల్పడితే తీవ్ర ప్రతీకారం తప్పదని ఇరాన్ హెచ్చరించింది. తమపై దాడి జరిగితే ఇజ్రాయెల్‌లోని కీలక మౌలిక సదుపాయాలతో పాటు మధ్యప్రాచ్యంలోని అమెరికా ఇంధన కేంద్రాలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని టెహ్రాన్ స్పష్టం చేసింది. అలాగే హోర్ముజ్ జలసంధిలో నౌకా రవాణాపైనా ప్రభావం చూపే చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. దీంతో మధ్యప్రాచ్య పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారగా, ప్రపంచ దేశాలు ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాయి

# మీసేవలో చరిత్రాత్మక రికార్డు.. ఒక్కరోజులో 2.20 లక్షల లావాదేవీలు: మంత్రి శ్రీధర్ బాబు

తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ పాలనకు ప్రతీకగా నిలిచిన మీసేవ సేవలు మరో అరుదైన ఘనతను సాధించాయి. గతంలో రోజుకు సగటున 70 నుంచి 80 వేల వరకు మాత్రమే నమోదయ్యే లావాదేవీలు, తాజాగా ఒక్కరోజులోనే 2.20 లక్షలకు చేరుకోవడం విశేషమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మీసేవ చరిత్రలో తొలిసారిగా రెండు లక్షల మార్క్‌ను అధిగమించడం రాష్ట్ర ఈ-గవర్నెన్స్ వ్యవస్థ బలోపేతానికి నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ కార్డు దరఖాస్తులకు అత్యధిక స్పందన లభించగా, రవాణా శాఖ సేవలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర పౌర సేవల కోసం కూడా భారీ సంఖ్యలో ప్రజలు మీసేవను ఆశ్రయించినట్లు వెల్లడించారు. ప్రజలకు సులభంగా, వేగంగా, పారదర్శకంగా సేవలు అందించడం వల్లే ఈ స్థాయి ఆదరణ లభించిందని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి సాంకేతిక అంతరాయాలు లేకుండా లక్షలాది లావాదేవీలను విజయవంతంగా నిర్వహించిన మీసేవ బృందాలు, సాంకేతిక నిపుణులు, సంబంధిత శాఖల అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా భవిష్యత్తులో మరిన్ని పౌర సేవలను మీసేవ వేదిక ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. సాంకేతికతను మరింత సమర్థంగా వినియోగించి సేవల నాణ్యత, వేగం, పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి పౌరుడు ప్రభుత్వ సేవలను కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఆన్‌లైన్‌లో సులభంగా పొందేలా మీసేవను మరింత విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి స్పష్టం చేశారు. దీంతో తెలంగాణ డిజిటల్ గవర్నెన్స్‌లో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143